www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
ఆదివారం

# వెలుతురు

రంగారెడ్డి। 28, జనవరి 2024
తెలుగు దిన పత్రిక
సంపుటి: 5 సంచిక: 249, పేజీలు: 12, వెల: రూ.5/-



## విసిల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్

హైదరాబాద్,జనవరి27(వెలుతురు): తెలంగాణలోని పలు విశ్వ విద్యాలయాలకు సంబంధించి వైస్ ఛాన్సెలర్ల నియామకానికి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉస్మానియా వర్సిటీ, జేఎన్‌టీయూ హైదరాబాద్, వరంగల్ కాకతీ, కాకతీయ, నల్గొండ మహాత్మాగాంధీ, కరీంనగర్ శాతవాహన, నిజామాబాద్ తెలంగాణ, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు, హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ, డాక్టర్ అంబేద్కర్, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలకు వీసీల నియామకానికి విద్యాశాఖ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 12న సాయంత్రం 5గంటల్లోగా వీసీ పోస్టు కోసం గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.





## ఎన్నికల హామీల
# అమలు దిశగా అడుగులు

- కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం
- లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా బీసీ స్టడీ సర్కిల్
- సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల ద్వారా నిధులు
- హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించేలా చర్యలు
- బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్షలో సిఎం రేవంత్

హైదరాబాద్,జనవరి27(వెలుతురు):
ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ క్రమంలో అంచనాలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రూ. లక్షతో పాటు తులం బంగారం ఇచ్చేలా ప్రణాళికను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ నిర్వహణకు అవసరమైన పూర్తి బడ్జెట్‌ను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. అంచనా వ్యయం ఆధారంగా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులువిడుదల చేద్దామని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని సీఎం ఆదేశించారు. అవసరమైన చోట సొంత భవనాలు నిర్మించేందుకు భూమిని గుర్తించాలన్నారు. సొంత భవనాలు నిర్మించేందుకు అంచనా వ్యయాన్ని రూపొందించాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం ఒక యూనిట్‌గా బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు అంశంపై పూర్తి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్ , సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

మిగతా.. 2లో

## బిజెపిని ఓడించే సత్తా బిఆర్ఎస్‌కు మాత్రమే ఉంది

**అసెంబ్లీలో ముగ్గురు ఎంపిలు, ఇద్దరు ఎమ్మెల్యేలను ఓడించాం**

**కాంగ్రెస్ జోడో..అంటుంటే..నేతలు ఛోడో అంటున్నారు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్,జనవరి27(వెలుతురు):
బిజెపిని ఓడించే సత్తా కేవలం బిఆర్ఎస్‌కు మాత్రమే ఉందని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి రామారావు అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు ఎంపిలను, ఇద్దరు ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ఓడించారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలంటే బిఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిజెపిని ఓడించే సత్తా లేదన్నారు. జీహెచ్ఎంసీ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుందని.. కానీ హైదరాబాద్ బయట స్వల్ప ఓట్ల తేడాతో సీట్లు తగ్గాయని.. 14 సీట్లలో స్వల్ప తేడాతో కోల్పోయామని కేటీఆర్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడాలో నిర్వహించిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చలేక బీఆర్ఎస్‌ను బద్నామ్ చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ గొంతు పిసుకుతా అని రేవంత్ మాట్లాడారని.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకు కేసీఆర్ గొంతు పిసుకుతారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో అంటుంటే ఆయన పార్టనర్స్ అంతా రాహుల్ చోడో అంటున్నారని ఎద్దేవా చేశారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, నితీష్ కుమార్ అందరూ కాంగ్రెస్‌ను వదిలేస్తున్నారన్నారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదన్నారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా కేసీఆర్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ లాంటి

మిగతా.. 2లో

## త్వరలో రాష్ట్రంలో కుల గణన

- నియోజక వర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్
- గురుకులాలకు సొంత భవనాలకు స్థలాల గుర్తింపు
- గ్రీన్ ఛానల్ ద్వారా డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు
- విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మరింత ప్రయోజనం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విభాగాల సమీక్షలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి



హైదరాబాద్ వెలుతురు జనవరి 27:
త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపడుతామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం రోజున సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన

మిగతా.. 2లో

## రాజీనామాకు సిద్దంగా నితీశ్ కుమార్

- బిజెపి మద్దతుతో తిరిగి నేడే సిఎంగా ప్రమాణం
- బిజెపికి దక్కనున్న స్పీకర్ పదవి, డిప్యూటి సిఎం
- నేడు పాట్నాకు రానున్న అమిత్ షా, నడ్డా



పాట్నా,జనవరి27(వెలుతురు):
బీహార్‌లో తలెత్తిన రాజకీయ సంక్షోభం పతాక స్థాయికి చేరుకుంది. నితీశ్ రాజీనామాకు రంగం సిద్ధం అయ్యింది. 'మహాఘట్బంధన్'కు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సారథ్యంలోని జేడీయూ గుడ్‌బై చెప్పడం ఖాయమైంది. ముఖ్యమంత్రి పదవికి నితీష్ శనివారం పొద్దుపోయేలోగా రాజీనామా చేయనున్నారని, పలువురు కాంగ్రెస్ నేతలు కూడా ఆయనతో కలవనున్నారని పార్టీ వర్గాల సమాచారం. రాజీనామా లేఖతో గవర్నర్‌ను కలుసుకుని, బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వెంటనే ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎంగా నితీష్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. బీజేపీతో పొత్తులో భాగంగా ఆ పార్టీకి రెండు ఉపముఖ్యమంత్రి పదవులతో పాటు స్పీకర్ పదవి కూడా దక్కనుంది. కాగా, ప్రభుత్వం ఏర్పాటుకు ఆర్జేడీ బలసమీకరణ జరిపే లోపే వేగంగా నితీష్ రాజీనామా చేయడం, తిరిగి సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం చకచకా జరిగిపోవాలని అటు జేడీయూతో పాటు ఆ పార్టీతో చెలిమికి సిద్ధమైన బీజేపీ పెద్దలు వ్యూహారచన సాగిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, ఆర్జేడీ నేత, ఉప ముఖ్యమంత్రి తేజస్వి

మిగతా.. 2లో



## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీలు

హైదరాబాద్,జనవరి27(వెలుతురు):
గవర్నర్ కోటాలో నియితులైన ఇద్దరు ఎమ్మెల్సీలు కోదండరామ్, అమీర్ అలీఖాన్‌ను శనివారం సచివాలయంలో సిఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరిని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అమోదించారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించారు. వీరిద్దర్ని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో వీరిద్దరు శనివారం సిఎంను కలసి అభినందించారు.

## ఆప్ ప్రభుత్వం
# కూల్చివేతకు బిజెపి కుట్ర



- ఒక్కో ఎమ్మెల్యేకు 25 కోట్ల ఆఫర్
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ,జనవరి27(వెలుతురు):
తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిజెపి కుట్రలు పన్నిందని ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ నేతలు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కూల్చేందుకు ఇటీవలె కొందరు బీజేపీ

మిగతా.. 2లో



## అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం
# దృష్టి కేంద్రీకరించాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచన

హైదరాబాద్,జనవరి27(వెలుతురు):
ప్రజలకు మేలు చేసేలా, హైదరాబాద్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. బేగంపేట్ హోటల్ హరిత ప్లాజాలో అభివృద్ధి కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. దిశ కమిటీ చైర్మన్

మిగతా.. 2లో



GeneralNEWS

# మేడారం జాతర పోస్టర్ ఆవిష్కరణ

## మేడారం దర్శించుకుంటానన్న సిఎం రేవంత్



హైదరాబాద్,జనవరి27(వెలుతురు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం మహా జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం నాడు మేడారంలోని సమ్మక్క సారలమ్మ పోస్టర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 23న మేడారం జాతరకు వెళ్లి సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి మేడారం పూజారుల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి కి ఆహ్వానం అందింది. మేడారం ఆలయ పూజారుల సంఘం సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను సచివాలయంలో శనివారం అందజేసింది. వచ్చే నెలలో జరుగనున్న మేడారం జాతర ఏర్పాట్లు, సంబంధిత పనులపై దేవాదాయశాఖ అధికారులు సీఎం రేవంత్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రులు సీతక్క, పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ సమక్షంలో మేడారం జాతర పోస్టర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

# బిజెపిని ఓడించే సత్తా బిఆర్ఎస్‌కు మాత్రమే ఉంది

మొదటిపేజీ తరువాయి..
నాయకులకే ఉందన్నారు. మహాలక్ష్మి పథకం పెట్టి మహిళల మధ్య గొడవలు పెట్టారన్నారు. ఫ్రీ బస్సు మంచిదే కానీ బస్సుల సంఖ్య పెంచాలని హితవుపలికారు. ఆటో డ్రైవర్ల పొట్ట కూడా కొట్టారన్నారు. ఒక పథకం పెట్టినపుడు సరైన ప్రణాళిక ఉండాలని సూచించారు. రాష్టంలో కోటి 57 లక్షల మంది మహిళలకు రూ.2500 ప్రతినెలా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే కాంగ్రెస్ భయంలో ఉంటదన్నారు.

కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో ఎమ్మెల్యేగా ఓడిపోయి సానుభూతితో ఎంపీగా గెలిచారన్నారు. ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయ్యాక ఒక్క బస్తీకైనా ఎమన్నా మంచి పని చేశారా అని నిలదీశారు. దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయడం తప్ప కిషన్ రెడ్డి చేసింది ఏముందని ప్రశ్నించారు. మోడీ ప్రియాయమైన ప్రధాని కాదని.. పిరమైన ప్రధాని అని జనాలు అంటున్నారన్నారు. భారత్ మొత్తంలో అట్టర్ ఎలాఫ్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటూ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీవి ఫెవికాల్ బంధమని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఇంటింటి సమగ్ర సర్వే చేశామని.. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుపైకి తీసుకువచ్చిందని రామారావు విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం తెలంగాణ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచామన్నారు. చాలా నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు బంగారు ప్లేటులో



తెలంగాణను పెట్టి ఇచ్చామన్నారు. ఇండియా కూటమి నుంచి ఒక్కో పార్టీకి బయటకు వెళ్లిపోతుందన్నారు. బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్ సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్‌ను భరించాలంటే తమ వల్ల కాదని నితీశ్‌కుమార్ అంటున్నారన్నారు. కూటమికి నితీశ్ కుమార్ కూడా బైబై చెప్పారని, బీజేపీని ఆపాలంటే ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ బొండిగ పిసికేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని బండి సంజయ్ అంటున్నాడని, రాష్టాన్ని అభివృద్ధి చేసినందుకా, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని, ఉచిత బస్సు పథకం రచ్చరచ్చ అయ్యిందన్నారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆగమైపోయారన్నారు. బిల్డప్ కోసం పథకాలు తెస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. రాష్ట్రంలో 51శాతంపైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధమని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను పంపితే తిరస్కరించిన గవర్నర్, కాంగ్రెస్ పంపగానే ఆమోదించిందన్నారు. రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలువగానే రెండు ఎమ్మెల్సీలను ఖరారు చేశారని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి మరోసారి ఓటు అడిగే హక్కులేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోతే ప్రజలు బాధపడి సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించారని, కేంద్రమంత్రిగా ఒక్క పని చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి రూపాయి నిధులు కూడా కిషన్ రెడ్డి కేటాయించలేదని విమర్శించారు. కేంద్రమంత్రిగా ఉండి ఎందుకు దండగ అన్నారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. మోదీ పాలనలో ధరల పెరుగుదల తప్ప మరేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్న కేటీఆర్. ఇద్దరూ కలిసి రాష్ట్రంలో డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలకు కోపమొస్తుందని.. ఇందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు సరైన సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా కూటమిని గెలిపించాల్సిన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# త్వరలో రాష్ట్రంలో కుల గణన

మొదటిపేజీ తరువాయి..
సంక్షేమ విభాగాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు. మహాత్మ జ్యోతిభా పూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ స్కీమ్ ను మరింత సమర్థంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పుడున్న దాని కంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని అన్నారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీల ర్యాంకింగ్ ల ఆధారంగా టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్ వర్క్ తయారు చేయాలని అన్నారు. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్ లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటేడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు.

నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటేడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. దీంతో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ కూడా మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాటవాలు పెరుగుతాయని, పోటీ తత్వం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా మండల కేంద్రా లను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని అన్నారు.

ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థల, కంపెనీల సహకారం తీసుకోవాలని సీఎం అన్నారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ ను సమీకరించాలని, ముందుకు వచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాలకు కూడా సీఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలని సూచించారు.

కళ్యాణ మస్తు, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్ ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్ గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ శ్రీ పొన్నం ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గారు, ప్రభుత్వ సలహాదారు శ్రీ షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి

మొదటిపేజీ తరువాయి..
హోదాలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం సుధీర్ఘంగా నాలుగు గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, దిశ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో మాదిరిగానే శనివారం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ కమిటీ) సమావేశాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, విద్యుత్ సంబంధిత సమస్యల గురించి చర్చించడం జరిగింది. దిశా కమిటీ చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు ప్రజా సమస్యలు, కీలకాంశాలపై చర్చించానని తెలిపారు.

హైదరాబాద్ నుంచి తెలంగాణకు 80 శాతం రెవెన్యూ వస్తోంది. ప్రతిరోజు సుమారు 10 లక్షల మంది హైదరాబాద్‌కు రాకపోకలు జరుపుతుంటారు. హైదరాబాద్ నగర ప్రజల కోసం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. కార్మికులు ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం డ్రైనేజీ సమస్యలతో పాటు డ్రింకింగ్ వాటర్ సదుపాయం కల్పించాలి. హైదరాబాద్‌లోని అంగన్వాడీలు, పాఠశాలలు, హాస్టల్స్ కిరాయి బిల్డింగుల్లో కొనసాగుతున్నాయి. పేదపిల్లలు చదువు కోసం సదుపాయాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం లేదు. కేంద్ర ప్రభుత్వం 29 మైనారిటీలకు సంబంధించి స్కూళ్లకు నిధులు విడుదల చేసింది. మైనారిటీ, మెజారిటీ అనే తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోంది. రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని కిషన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్ర ప్రభుత్వం రూ. 715 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణలో సహకారం అందించడం లేదు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్‌తో పాటు ప్రయాణికులకు సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ మూడు టర్మినల్స్‌కు అదనంగా చర్లపల్లి దగ్గర మరో టర్మినల్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నాం. చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అంబర్‌పేట్, ఉప్పల్ ఓఓటలవర్లు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కొరవడిన కారణంగానే పెండింగ్‌లో ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించకపోయినా ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను కేంద్ర ప్రభుత్వం పూర్తిచేయడం జరిగింది. కొమురవెల్లి మల్లన్న దేవాలయానికి పెద్దఎత్తున భక్తులు వెళ్తారు. అక్కడ రైల్వేస్టేషన్ నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ చేస్తాం. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడాలని డిమాండ్ చేస్తున్నాం కిషన్ రెడ్డి చెప్పారు.

# ఆప్ ప్రభుత్వం కూల్చివేతకు బిజెపి కుట్ర

మొదటిపేజీ తరువాయి..
నాయకులు తమ ఎమ్మెల్యేలను సంప్రదించారని చెప్పారు. 21 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారని ఆరోపించారు. తాను ఈ విషయంపై ఏడుగురితో మాట్లాడానని వారంతా తిరస్కరించామని చెప్పారని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తామని తమ ఎమ్మెల్యేలతో వారు చెప్పినట్టు తెలిసిందని కేజ్రీవాల్ అన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలపై విరుచుకు పడతామని బెదిరింపులకు గురిచేశారని తెలిపారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని హెచ్చరించారని ఇందుకు ఒప్పుకుంటే 25 కోట్లు ఇచ్చి ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయిస్తామని ఆప్ ఎమ్మెల్యేలతో చెప్పారని కేజ్రీవాల్ అన్నారు. మద్యం కుంభకోణంపైనా దర్యాప్తు చేసేందుకు తనను అరెస్టు చేయడం లేదని కేవలం ప్రభుత్వాన్ని కూల్చేందుకు తనని అరెస్టు చేస్తున్నారని కేజ్రివాల్ అన్నారు. గత తొమ్మిదేళ్లలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎన్నో కుట్రలు పన్నారని ఆరోపించారు. కానీ అవి ఏ మాత్రం విజయం సాధించలేదని తెలిపారు. దేవుడు, ప్రజలు ఎల్లప్పుడూ తమకు మద్దతు ఇచ్చారని అన్నారు. ఢిల్లీ ప్రజలు ఆప్ ని అమితంగా ప్రేమిస్తారని చెప్పారు. తమ ఎమ్మెల్యేలంతా కలిసి ఉన్నారని ఆప్ చీఫ్ తెలిపారు. ఆప్‌కు చెందిన మొత్తం 21 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ పెద్దలు చర్చలు జరిపారని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నంలో భాగంగానే ఇలా చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు కేజ్రీవాల్ ఓ ట్వీట్ చేశారు. '21 మంది ఎమ్మెల్యేలతో చర్చలు జరిగాయి. ఇతర ఎమ్మెల్యేలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం. మీరు కూడా మాతో రావొచ్చు. రూ.25 కోట్లు ఇస్తాం ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయండి' అంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నం చేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు. అయితే ఆప్ ఎమ్మెల్యేలు అందరూ బీజేపీ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వెల్లడించారు.

# రాజీనామాకు సిద్ధంగా నితీశ్ కుమార్

మొదటిపేజీ తరువాయి..
యాదవ్ సైతం తమ పార్టీ నేతలతో పాట్నాలో అత్యవసర సమావేశం జరిపారు. తాజా పరిస్థితిపై ఒక స్పష్టత వచ్చేంతవరకూ ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, సంయమనం పాటించాలని కోరారు. 'ఇక ఆట మొదలుపెట్టడమే తరువాయి' అని ఆర్జేడీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశర చేశారు. పార్టీ నేతలంతా అందుబాటులోనే ఉండాలని, బీజేపీతో చేతులు కలిపేందుకు నితీష్ నిర్ణయం తీసుకుంటే దీనిని సవాలు చేస్తూ అసెంబ్లీలో బ్జడెట్ సమావేశాల సందర్భంగా ఫిబ్రవరి 5న 'విశ్వాస పరీక్ష'కు వెళ్దామని సూచించినట్టు కూడా తెలుస్తోంది.

నితీష్‌ను సీఎంగానే ఉంచి లోక్‌సభ ఎన్నికలకు కలిసి వెళ్లేందుకు సూత్రప్రాయంగా బీజేపీ అంగీకరించి నందున ప్రమాణస్వీకారానికి హాజరయ్యేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారంనాడు పాట్నాకు వస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాలతో బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఏ క్షణాన ఏమి జరుగనుందనే ఉత్కంఠ ప్రధాన పార్టీల్లో నెలకొంది.

243 సీట్ల బిహార్ అసెంబ్లీలో కనీస మెజారిటీకి 122మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ఆర్జేడీకి 79, బీజేపీకి 78, జేడీయూకి 45, కాంగ్రెస్‌కు 19, వామపక్షాలకు 16, హెచ్ఏఎంకు నలుగురు ఎమ్మెల్యేలు, ఎంఐఎంకు ఒక్కరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు ఆర్జేడీతో కలిసి ఉన్నాయి. ఈ 3 పార్టీల బలం 114. అంటే మెజారిటీకి మరో 8 మంది ఎమ్మెల్యేలు అవసరం. జేడీయూ-బీజేపీ చేతులు కలిపితే 123మందితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతాయి.

# త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

## ప్రక్రియ ప్రారంభించనున్న సర్వీస్ కమిషన్

## డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

ఖమ్మం,జనవరి27(వెలుతురు): త్వరలోనే నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కవ్యాఖ్యానించారు. టీఎస్పీఎస్సీ సభ్యులను నియమించామని..దీంతో కమిషన్ ఇక పూర్తిస్థాయిలో పనిచేస్తుందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల నియాక ప్రక్రియ కొనసాగుతుందని అన్నారుఇంతకాలం నిరుద్యోగులకు సరైన ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తెలంగాణ కోసం పోరాడినా ఉద్యోగాలు రాకపోవడంతో గత పదేళ్లుగా వారు ఆందోళనలో ఉన్నారని అన్నారు. నిరుద్యోగులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. శనివారం నాడు చిలుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆరోపించారు. పదేళ్ల పాలనకు ప్రజలు చరమగీతం పాడారని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు లక్షల కోట్ల సంపదను దోచుకున్నారని మండిపడ్డారు. ఆ పార్టీకి త్వరలోనే దిమ్మతిరిగే జవాబు చెబుతామని హెచ్చరించారు. ప్రజల సంపదకు కస్టోడియన్‌గా ఉంటామని హామీ ఇచ్చారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటనలకు వస్తే ముందస్తుగానే అరెస్టులు చేసే సంస్కృతి ఉండేదని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వాళ్లు ఉండాలి... అందుకే ధర్నా చౌక్‌ని తెరిపించినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# నీటిపారుదల శాఖపై సిఎం సమీక్ష

## ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని ఆదేశం

హైదరాబాద్,జనవరి27(వెలుతురు): సచివాలయంలో నీటి పారుదలశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత అధికారులు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రాజెక్టులవారీగా ఆయకట్టు వివరాలలో కొంత గందరగోళం ఉందన్నారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను ఈ సందర్భంగా సీఎంకు అధికారులు వివరించారు.

ప్రాధాన్యతల వారీగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై రేవంత్ ఆరా తీశారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. నారాయణపేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదటి ప్రాధాన్యతగా తీసుకుని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయాలని, పూర్తి చేస్తే 4లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చన్నారు. కొన్ని ప్రాజెక్టులను గ్రీన్ ఛానెల్ ద్వారా వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఎన్నికల్లోల లబ్ధి పొందేలా కాంగ్రెస్ కసరత్తు

## వేగంగా ప్రభుత్వ పథకాల అమలు

## కులగణనతో బిసిల్లో లబ్ధి పొందే అవకాశం

## అవసరమైతే బిసిలకు డిప్యూటి సిఎం పదవి?

హైదరాబాద్,జనవరి27(వెలుతురు): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వివిధ పథకాల అమలును వేగవంతం చేసింది. అలాగే హామీలను నెరవేర్చే కార్యక్రమాలు చేస్తోంది. ఇప్పటికే రైతుబంధు కూడా అమలు చేస్తోంది. ఈ క్రమంలో బిసిలకు పెద్దపీట వేస్తున్నారు. కుల గణనకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు తెలంగాణకు రెండో ఉపముఖ్యమంత్రిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఈ అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. ఇప్పటికే ఎస్సీ సామాజిక వర్గం నుంచి మల్లు భట్టి వి÷-రమార్క డిప్యూటి సిఎంగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే మరో డిప్యూటీ సీఎం, కొందరు మంత్రులు ప్రమాణం చేస్తారని సమాచారం. త్వరలోనే కేబినేట్ విస్తరణ ఉంటుందని ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల సమయంలో ఉదయ్ పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఇద్దరు బీసీలకు సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ లోని ఓబీసీ నేతల టీం అధినాయకత్వాన్ని కోరింది. రాష్ట్రంలో 17 పార్లమెంటు సెగ్మెంట్ల పరిధిలో 34 మంది బీసీలకు కాంగ్రెస్ టికెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే రకరకాల సమీకరణాలు, గెలుపు గుర్రాల ఎంపిక క్రమంలో బీసీలకు కేవలం 23 టికెట్ల మాత్రమే లభించాయి.అందులో దాదాపు 10 టికెట్లు గ్రేటర్ పరిధిలోనే ఉండటం గమనార్హం. ఎక్కువ సీట్లు మైనార్టీ ఏరియాల్లో ఇవ్వడం వల్ల ఓటమి బీసీ అభ్యర్థులు ఓటమి చెందారనే భావన నెలకొంది. ఈ నేపథ్యంలో బీసీ ప్రాతినిధ్యాన్ని పెంచాలని, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ కు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. మరో అడుగు ముందుకు వేసి బీసీ నేతకు కీలకమైన ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని సమాచారం. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది త్వరలోనే తేలనుంది.

కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్, కర్నాటకల్లో ఒక్కొక్క డిప్యూటీ సీఎం ఉండగా.. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కూడా ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉన్నారు. పొరుగునే ఉన్న ఏపీలో ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఉండటం గమనార్హం. తెలంగాణలో 18 మంత్రి పదవులకు అవకాశం ఉండగా.. ప్రస్తుతం ఆరు ఖాళీ ఉన్నాయి. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో



వీటిని సామాజికవర్గాలు, ఇతర రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇకపోతే ఎన్నికల ముందు పిసిసి చీఫ్‌ను మారుస్తారా లేదా అన్న చర్చ కూడా సాగుతోంది.

ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగు తున్నాయి. ఆ పదవిని ఇతరులకు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. లోక్ సభ ఎన్నికలకు ముందు జరుగుతుందా.. తర్వాత చేస్తారా.. అన్నది కాంగ్రెస్ అధినాయకత్వం చేతిలో ఉంది. ఒక వేళ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలకు పీసీసీ చీఫ్ పదవి దక్కితే.. మైనార్టీ వర్గానికి చెందిన నాయకుడు డిప్యూటీ సీఎం అయ్యే అవకాశం ఉందని సమాచారం. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పేరు పీసీసీ చీఫ్ గా పరిశీలనలో ఉందని సమాచారం. లేదంటే ఆయనకు డిప్యూటీ సీఎం పోస్టు దక్కవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరో కీలక నేత, తెలంగాణ ఉద్యమకారుడు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా డిప్యూటీ సీఎం రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రతిపక్షాలకు దీటుగా కౌంటర్ ఇస్తూ.. నిత్యం ప్రజల్లో ఉంటూ దూసుకుపోతున్న పొన్నం ప్రభాకర్ ను డిప్యూటీ సీఎం పదవి వరించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మైనార్టీకి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వానుకుంటే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన అమీర్ అలీ ఖాన్ పేరును పరిశీలించాల్సి ఉంటుంది.




రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆరుట్ల గ్రామంలో ఆదివారం 28-01-2024
ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిరాహార దీక్ష..
చట్టసభలలో బీసీ, ఈబీసీల రిజర్వేషన్ల కోసం జరిగే ఈ పోరాటంలో అందరూ ముందుండి తన హక్కుగా పోరాడాలి....
సాధించే వరకు పోరాడుదాం...
రా..కదిలి రండి.. రా కదలిరండి...
పంజాల జైహింద్ గౌడ్, ఆల్ ఇండియా ఎన్ఎస్ఎస్ చైర్మన్



# గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

### మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 27:** మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్ ఫిబ్రవరి 4వ తేదీ నుండి 11వ తేదీ వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం అభియాన్) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెద్దశంకరం పేట మండల బిజెపి అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు... శనివారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. పేదల సంక్షేమం మహిళా సాధికారత అంతర్గత బాహ్య భద్రత సాంస్కృతిక పునరుద్ధరణ తదితర అంశాల్లో భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా గత పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ఎన్నో రంగాల్లో అసాధారణ అభివృద్ధి సాధించిందని వివరించారు.. పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి కార్యకర్తలు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి గ్రామ బూత్ స్థాయిలో ప్రజలందరికీ వివరించాలన్నారు... జహీరాబాద్ పార్లమెంట్ సహ విస్తారక్‌గా రాచర్ల అశోక్ అందరికీ అందుబాటులో ఉంటారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు..

ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్ మంగలి కృష్ణ .. మహేష్. బుగుడాల కృష్ణ అనిల్ సుభాష్ సురేష్ అంజయ్య రాజు భూమేష్.. తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవి జూనియర్ కాలేజీలో వార్షికోత్సవ వేడుకలు

### పాల్గొన విద్యార్థి విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

### పట్లోల చంద్రశేఖర్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 27 :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని వాగ్దేవి జూనియర్ శివాజి డిగ్రీ కళాశాలలో అనువల్ డే ప్రోగ్రాం లో పాల్గొని నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు





తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్ కరస్పాండెంట్ నరసింహారెడ్డి శ్రీనివాస్. లెక్చరర్ల బృందం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శంకర్ సెట్. బోజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు .అంజిరెడ్డి వైస్ పి ఏ సి ఎస్ చేర్మెన్ . ఎంపీపీ తనయుడు రమేష్ చౌహాన్.పండరి రెడ్డి. ముంతాజ్ మాజీ ఎంపీటీసీ లు .వినోద్ పటేల్ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు .జ్ఞానేశ్వర్ పాటిల్. జానీ పటేల్. నారాయణ్ జాదవ్. బి రాజు. మీడియా ప్రతినిధులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# సామాన్యునికి అండగా ... మానవ హక్కుల వేదిక పోరాటం

- - హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర నేత జి.మోహన్
- ఆటుపోట్లను ఎదుర్కొని 25 వసంతాలు పూర్తి.
- అమరుల స్ఫూర్తితో తెలుగు రాష్ట్రాల్లో హెచ్ఆర్ఎఫ్ ను బలోపేతం చేస్తాం.
- నేరేడుచర్ల నిరుపేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి.
- ఇండ్ల స్థలాల సాధనకు న్యాయపోరాటం చేస్తాం.

**నేరేడుచర్ల మండలం వెలుతురు జనవరి 27:**
అనేక ఆటుపోట్లను ఎదుర్కొని మానవ హక్కుల వేదిక 25 వసంతాలను పూర్తి చేసుకున్నదని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.మోహన్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి వద్ద సర్వే నెంబర్ 234,244 లల్లో ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న నిరుపేదల సమక్షంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మానవ హక్కుల వేదిక 25 వసంతాల ప్రస్థానం సభను నిర్వహించారు.

ఈ సభకు వేదిక జిల్లా అధ్యక్షులు చింతమల్ల గురువయ్య అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జి.మోహన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ హక్కుల పోరాటంలో అనేక ఆటుపోట్లను తట్టుకొని, సామాన్య ప్రజల గొంతుక గా హెచ్ఆర్ఎఫ్ నిలబడిందన్నారు. ఈ క్రమంలో బాలగోపాల్ , బుర్ర రాములు లాంటి అనేకమంది నాయకులు తమ చివరి శ్వాస వరకు నిబద్ధతతో హక్కుల ఉద్యమంలో పనిచేశారని, వారి ఆశయ సిద్ధి కోసం తమ సంస్థ నిత్యం కృషి చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నట్లుగా తెలిపారు.
ఈ సభలో వక్తులుగా ఎన్. హరేందర్, అద్దంకి దశరథ, వాస పల్లయ్య ప్రసంగించారు.
నేరేడుచర్ల మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 234,244 లో గత కొన్ని ఏండ్లుగా ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకొని పోరాడుతున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైనట్టుగా తెలిపారు. ఇప్పటికైనా రెవిన్యూ యంత్రాంగం మేల్కొని అన్యాక్రాంతమైతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.
నేరేడుచర్లలో ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న 200 మంది పక్షాన అవసరమైతే న్యాయపోరాటం చేయనున్నట్టుగా మానవ హక్కుల వేదిక నాయకులు ప్రకటించారు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి ఎం ఎస్ ప్రసాద్, సందే సత్తమ్మ, మాలాంబి, వాస కరుణాకర్, రంగయ్య, మరియమ్మ మల్లేశ్వరి, లక్ష్మి, పావని, శ్యామల, మంగమ్మ, సయ్యద్, హుస్సేన్, బుచ్చమ్మ, రెడ్డిపల్లి కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జనరంజక పాలన సాగిస్తున్న సీఎం రేవంత్

### పదేళ్ల కెసిఆర్ కుట్రలకు తెలంగాణ ప్రజలు బలి

### ప్రజా పాలనలో నా వంతు పాత్ర నిర్వహిస్తాను

### సీఎంకు మాజీ మంత్రి మోత్కుపల్లి శుభాకాంక్షలు



**హైదరాబాద్, వెలుతురు జనవరి 27:**
సీఎం రేవంత్ రెడ్డి జన రంజక అద్భుతమైన పాలన అందిస్తున్నారని మాజీ మంత్రి సీనియర్ రాజకీయ నాయకులు మోతుకుపల్లి నర్సింహులు అన్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మీడియా పాయింట్ లో విలేకరులతో మాట్లాడుతూ నెల రోజుల పాలన చూస్తుంటే చాలా సంతోషంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ఒరవడితో ముందుకు సాగుతుందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల మధ్యన ఉన్నదని భావనను కల్పిస్తుంది అన్నారు. భవిష్యత్తులోనే ఇదే వర్ని కొనసాగించాలని మేధావులు, ప్రజా సంఘాల నేతలతో సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు రాత్రి, పగలు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజా పాలనలో తన వంతు పాత్ర నిర్వహిస్తానని స్పష్టం చేశారు. తన అనుభవాన్ని సలహాలను ప్రభుత్వానికి ప్రజలకు ఇవ్వడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని అన్నారు. టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందు ప్రయత్నిస్తున్నాడని అన్నారు. కెసిఆర్ ఆటలు ఇక తెలంగాణలో సాగవని మొత్తం తెలంగాణలో పార్లమెంట్ సీట్లు అన్నీ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తెలంగాణ మాదిగలంతా ముక్త కంఠంతో కేసీఆర్ కు చరమగీతం పాడి కాంగ్రెస్ కు పట్టం కట్టారని గుర్తు చేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వమని అన్నారు. ప్రజల వద్దకు పాలనగా రేవంత్ ప్రభుత్వం నడుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రజలు 10 సంవత్సరాలు కేసీఆర్ కుట్రలకు బలయ్యారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలన సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త గిరెడ్డి ముకుంద రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ సగరపు ప్రసాద్, తెలంగాణ యువ నాయకులు మాతంగి శ్రీనివాస్, జననేత జనతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీగా నియమతులైన అమీర్ అలీఖాన్‌కి శుభాకాంక్షలు తెలిపిన డా.యస్.ఏం.హుస్సేనీ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:**
శనివారం రోజున గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమతులైన సియాసత్ ఉర్దూ పేపర్ ఎడిటర్ జనాబ్ అమీర్ అలీఖాన్ గారిని టీఎస్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.యస్.ఏం.హుస్సేనీ (ముజీబ్) మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ వర్గానికి శ్రీ అమీర్ అలీ ఖాన్ గారి సేవలు ఎంతో అవసరమని, రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గవర్నర్ కోటాలో ప్రొఫెషన్ కోదండరాం గారిని మరియు అమీర్ అలీ ఖాన్ గారిని నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి శిరసు వంచి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మొహమ్మద్ నసీరుద్దీన్ మరియు వికాస్ రెడ్డి పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో మట్కా స్థావరాలపై టాస్కోఫోర్స్ పోలీసుల దాడులు

### నిందితుల వద్ద నుండి 1,43,500 రూపాయలు సీజ్

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం : జిల్లా ఎస్పీ రూపేష్

**జహీరాబాద్, 27 జనవరి వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామం, జహీరాబాద్ లో మట్కా స్థావరాలపై టాస్కోఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వివిధ రకాల అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అరికట్టేందుకు సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ ఏర్పాటు చేసిన టాస్కోఫోర్స్ బృందాలు ఏ కసాటిగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామానికి చెందిన నాలుగు వ్యక్తులు నిషేధించ బడిన మట్కా ఆడుతున్న 1) యం.కృష్ణ తండ్రి అంజయ్య, 2) కంటి రవి తండ్రి బాబు, 3) కంటి రాజు తండి బాబు, 4) చిలకపల్లీ చంద్రయ్య తండ్రి నర్సయ్యలు, జహీరాబాద్ పట్టణానికి చెందిన మరో ఇద్దరు 1) బోయిని నర్సిములు తండ్రి హన్మంతు, 2) కురేషి యాదుల్ తండ్రి మక్బూల్ కురేషి లను టాస్కోఫోర్స్ పోలీస్ అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి

నిందితుల వద్ద నుండి 1,43,500 రూపాయలను స్వాధీనం చేసుకొని నిందితులను





పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇకముందు కూడా ఈ దాడులు కొనసాగుతాయని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సంపాదకీయం..

## ఎంపిల పోరాటానికి ఇదే చివరి అవకాశం!

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరుగబోతున్నాయి. ఇంతకాలం విభజన సమస్యల మిన్నకున్న తెలుగు ఎంపిలు ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదు. ఖచ్చితంగా కేంద్రాన్ని నిలదీయాల్సిందే. అవసరమైతే ఉమ్మడిగా ముందుకు కదలాలి. పార్టీలకు అతీతంగా ఎంపీలంతా ఏకం కావాలి. సోమవారం నుంచి సమావేశాలు జరుగబోతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల ఎంపిలు తమ రాష్ట్రాల సమస్యలపై గళం విప్పాల్సి ఉంది.విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులు కుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే కాలం గడుపుతున్నారు. కనీసం ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై సమగ్ర చర్చకు పట్టుబట్టాలి. అందుకు అనుగుణంగా వాతావరణం సృష్టించుకోవాలి.ఇంతకాల ఏదో ఒక విధంగా తప్పించుకుంటున్న తీరు ఇప్పుడు ఇక చెల్లబోదు. ఎన్నికల సీజన్‌లో ప్రజల ముందుకు వెళ్లబోతున్న తరుణంలో పార్లమెంటులో సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉంది. ఇంతకాలం మొహం చాటేసినా చెల్లింది. ఇక చెల్లదన్న విషయం పాలక, విపక్ష పార్టీలు గుర్తించాలి. బిజెపి కూడా ఇంకెంతోకాలం మభ్యపుచ్చే మాటలతో ప్రజలను మోసగించలేదు. రాష్ట్ర విభజన ప్రక్రియపై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ వచ్చిన మోడీ..సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పరువు తీయాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నరే తప్ప తెలుగు రాష్ట్రాల సమస్య లు మాత్రం పరిష్కారం కావడం లేదు. రాష్ట్ర విభజనను కాంగ్రెస్ ప్రజాస్వామిక పద్దతిలో చేయలేదన్న భావన ఉంటే.. సమస్యలను ఏ విధంగా పరిష్కరించారో..చెప్పుకునేందుకు మోడీకి, బిజెపికి కూడా ఏమీ లేదు. ఎందుకంటే ఎపికి ఒక్కటంటే ఒక్క ప్రయోజనం కూడా చేకూరలేదు. చర్చకు తావులేకుండా అహం కారంతో నాటి కాంగ్రెస్ వ్యవహరించిందని మోదీ వాదనగా ఉంది. విశాఖ ఉక్కు, బయ్యారం ఉక్కు, కడప ఉక్కులపై నిర్మొహమాటంగా తేల్చాలి. కృష్ణా జలాలలపైనా పంచాయితీ తేల్చాలి. గత తొమ్మిదన్నరేళ్లుగా అనేక సమస్యలు ఉన్నా వాటిని చర్చించడం లేదు. విభజన ప్రక్రియ ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పుట్టించింది. ఇది ఎవరూ కాదనలేని నిజం. ఇప్పటికీ నష్టం చేస్తున్నదని..ఎపి ప్రజలు వాపోతున్నదీ కూడా నిజమే. సానుభూతికన్నా సమస్యల పరిష్కారం ముఖ్యమన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. విభజన తరవాత ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు మానసికంగా స్థిరపడి పోయారు. ఎవరికి వారు బతుకుతున్నారు. ఈ స్థితిలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కాకుండా ప్రధాని మోడీ సమస్యలను పరిష్కరించే పెద్దరికం తీసుకోవాలి. ఏ పనిచేసినా అది ఈ దేశ భవిష్యత్ కోసమే అని గుర్తించాలి. కేంద్రం విభజన హామీలను నెరవేర్చడం లేదన్న ఆగ్రహంతో ఉన్న ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. బిఆర్‌ఎస్ ఎంపిలు గళం విప్పుతారని పార్లమెంటరీ సమావేశంలో కెసిఆర్ తెలిపారు. ఎపిలో అధికార వైసిపి పట్టించుకోక పోయినా విపక్షాలు సమస్యలపై నిలదీస్తున్నారు.మోడీ తీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మోడీపై విమర్శల దాడికి పూనుకున్నాయి. తిరుపతి పుణ్యక్షేత్రంలో మోదీ ఎన్నికల ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని ప్రమాణం చేసినా నెరవేర్చ లేదు. సరికాదా రకరకాల విన్యాసాలు చేశారు. కడప ఉక్కు సంగతి పక్కన పెడితే ఉన్న విశాఖ ఉక్కును తుక్కుగా అమ్మడానికి సిద్దం అయ్యారు. ఇది నిజంగానే ప్రజలకు ఆగ్రహం తెప్పించే విషయం. ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బకొట్టడమే. అమరావతి ఉద్యమం సాగుతున్న వేళ వారికి కనీస స్వాంతన చేకూర్చే ప్రయత్నం చేయలేదు. ఆదానీ,అంబానీ లాంటి వారికి మాత్రమే మోదీ అండగా ఉంటున్నారన్న భావన ప్రజల్లో బాగా బలపడిపోయింది. పేదలను నిరుపేద లుగా మార్చేస్తున్నారన్న విమర్శలకు మీడియా ద్వారా బాగా ప్రాచుర్యం వస్తోంది. పలు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టడం, వాటిని సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేయడం.. నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వారిని దేశం దాటించడం వంటి వాటిపైనా ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. ఇవన్నీ మోడీ నేతృత్వంలో జరిగినవే అన్న భావనా ఉంది. అయితే అనేక బిల్లులను మోడీ కూడా అలాగే చేశారు. పెరుగు తన్న నిత్యావసర ధరలు, పెట్రలో ధరలు, గ్యాస్ ధరలు, ఇంటి నిర్మాణ ధరలు.. జిఎస్టీ వాతలు వంటి వాటి ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నాయో అనుభవిస్తున్న ప్రజలకు మాత్రమే తెలుసు. పార్లమెంట్ సమావేశాల్లో వాటిగురించి ప్రస్తావించకుండా ఉండేందుకు బిజెపి ముఖ్యంగా మోడీ ఎన్నో ఎత్తుగడలు వేస్తున్నారన్న భావన ప్రజల్లో ప్రబలుతోంది. నిజానికి మోడీ వచ్చాక ఓ బృహత్తర భారతం ఆవిష్కృతం అవుతుందని అంతా భావించారు.

ప్రధానంగా సామాన్యులు చాలా ఆశ పడ్డారు. కానీ జరిగింది అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడుతున్నా.. మోడీ ఏనాడూ దానిపై చర్చించడం లేదు. పోరాటాలు చేస్తే తప్ప మోడీ దిగిరాడని ఉమ్మడి ఎపి ఎంపిలు కూడా గుర్తించాలి. తమ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. రాష్ట్ర బిజెపి నేతలు కూడా విమర్శలు, ఎదురుదాడి విధానాలు, అధికారమే లక్ష్యంగా పనిచేసే పద్ధతిని వీడాలి. విభజన సమస్యలపై పార్టీలో అంతర్గతంగా చర్చజరగడం లేదు. అయినా ఈ దేశాన్ని ఉద్ధరించే మహానుభావుడన్న రీతిలో మోడీని సోషల్ మీడియా వేదికగా పొగడ్తలతో ముంచెత్తే ప్రచారంలో బిజెపి నేతలు పోటీపడుతున్నారు. దేశంలో అనేక భయాలు వెన్నాడుతున్నా వాటిని సవరించి ఆదుకుంటా మన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు మోడీ ప్రభుత్వం భరోసాగా లేదన్న విషయం అర్థం అవుతోంది. ఎన్నికలకు వెళుతున్న వేళ ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు కావడంతో ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదు. సమస్యలను ప్రస్తావించి చర్చించేందుకు ఎంపీలంతా కట్టుబడి పనిచేయడం ముఖ్యం.



## ఆ అడుగుల జాడలు - ఆదర్శమయి ఈ వెలుగునీడలు

- శ్రీతేజ కలం

అడుగులలో అడుగడుగున సమాజహితం
మాటలలో ముత్యమోలే ఒదిగిన ప్రజాస్వామ్యం !!

ఆలోచనలలో కళగా వెలిగిన ధర్మపోరాటం
కనులలో కాచగ కోరుకోదగిన స్వాతంత్ర్యసమరం !!

ఉనికిలో నిలిచిన శుభోదయ ఉత్తేజం
పరిచయములలో పలికిన ప్రభాత భారతం !!

ఊపిరి నిలిచిపోయినను తోడున్న అనుభవం
దూరమయినను దగ్గరై నిలిచియున్న స్నేహం
ముందుతరములకు అందించగ పోరాటఫలితం !!


ఆ వినీలాకాశములో నిత్యం విలసిల్లే వర్దెల్లి రాములు
ఈనాటి విజయములకు చెరగని ఆ నవ్వులు ఆనవాలు !!!



- శశికాంత్ మెంచు
(91)789-316-9944

# ప్రైవేట్ విద్యలో డొల్లతనం

### వేలల్లో ఫీజులు వసూలుకే మొగ్గు





జిల్లాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో శిక్షణ, అనుభవం లేని ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారని విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. కొన్ని పాఠశాలలు కేవలం పై మెరుగుల తో విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. వేలల్లో ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలల్లో కొన్నిటిలో మాత్రమే కనీస సామర్థ్యాలు కనిపించాయి. గురుకులాల ఏర్పాటుతో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఇందులో చేరుతున్నారు. ఇక్కడ చేరిన విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలించగా ఈ విషయాలు బయట పడుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు వెల్లడించారు. ప్రైవేట్ పాటశాలల్లో విద్య మిధ్య అన్న నిజాన్ని అధికారులు గుర్తించారు. చాలాచోట్ల బట్టీ విధానం తప్ప పిల్లలకు అవగమయ్యే రీతిలో బోధించడం లేదని గుర్తించారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో గైడ్లు, పుస్తకాలపైనే ప్రధానంగా ఆధారపడుతున్నట్లు గుర్తించారు. తాజాగా గురుకులాలు మొదలయ్యాక అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లను ఇందులో చేర్చడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు పైసా ఖర్చు లేదన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. ఇదే సమయంలో పలుచోట్ల ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించినప్పుడు డొల్ల బయటపడుతోంది. ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారే తప్ప విద్యార్థులకు అర్థమవుతుందో లేదో పట్టించుకోవటం లేదని తేలిపోయింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే మెరుగైన సామర్థ్యాలు కనబరిచారు. కొన్ని పాఠశాలల్లో అక్షరాలను కూడా గుర్తించలేక పోయారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ)విధానాన్ని అమలుచేస్తున్నారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థులపై దృష్టిసారించగా అనేక లోపాలు బయటపడ్డాయి. నాలుగు భాగాలుగా నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనంలో అనేక లోపాలు కనిపించాయి. గతేడాది కంటే ఈ ఏడాది పరిస్థితి కొంత మెరుగుపడటం వూరటనిచ్చే అంశం. ప్రాక్టికల్ బోధనతో విద్యార్థుల్లో ఆలోచనలు, శక్తి సామర్థ్యాలు పెంచడం, భావాలను రాత, మాటల రూపంలో వ్యక్తీకరించేలా తీర్చిదిద్దేందుకు నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇది జిల్లాలో సరిగ్గా అమలు కావటం లేదు.

కనీస సామర్థ్యాలు లేక విద్యా ర్థుల్లో సృజనాత్మకత కరవైంది. నైపుణ్య సాధనలో వెనుకబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం అమలు బాగుందని గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సీసీఈ విధానం అన్ని విధాలుగా అమలయ్యేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డిజిటల్ తరగతుల నిర్వహణలోనూ ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇదంతఆ ఒక ఎత్తయితే చాలా ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను మెప్పించడానికి మార్కులు వేసి చూపుతున్నారు.

# కొత్త జిల్లాలతో తీరని సమస్యలు

### కనీస రహదారికినోచుకోని పల్లెలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. మంచినీటి కోసం గిరిజన గ్రామాలు అల్లాడుతున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల సమస్యలు దూరం కాలేదు. జిల్లాలను పునర్వ్యవస్థీకరించే ముందు ప్రజల అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేసినా సమస్యలను మాత్రం పరిష్కరించలేకపోయింది. నేటికీ అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఈ జిల్లాలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.




ఆయా గూడాల్లోని గ్రామాల్లో నేటికీ బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుష లుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ విద్యుత్తు వెలుగులకు నోచుకో లేదు.

# పరీక్ష ఒక పండుగ



మన గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు పరీక్షల విషయం గురించి చాలా లోతుగా చింతన చేశారు. వారు చెప్పిన విషయంలో ఒక కీలకమైన అంశం ఏమిటంటే, పరీక్షలను చూసి భయపడకుండా ఉండాలి. ఏదైనా ఎదురు దెబ్బ తగిలితే దాని గురించి తీవ్రంగా బాధపడడం కాకుండా దానిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించాలి. అలా బాధ పడడం, ఆ బాధలో దారి తప్పడం ఇది రెండు కూడా మంచి విషయాలు కావు. వైఫల్యం అంటే ఏమిటి? అది విజయం వైపు మనం వేస్తున్న అడుగు.దాన్ని పరాజయంగా మనం భావించరాదు. ఒకసారి పొరపాటు జరగవచ్చు. మనం అనుకున్న అంచనాలను అందుకోలేక పోవచ్చు. విజయం అంచుల దాకా వెళ్లి వెనక్కు రావచ్చు .లేదా విజయం సాధించలేకపోవచ్చు కూడా. అంత మాత్రం చేత మనం నిరాశ పడకూడదు. చరిత్ర పుటలలో ఎందరో శాస్త్రవేత్తలు ఒక అంశాన్ని కనుక్కోవడం కోసం పదే పదే ప్రయత్నాలు సాగించారు . ఆ ప్రయత్నాలలో వాళ్లకు శ్రమ కనిపించదు. ఎందుకు కనిపించదు? ఆ శ్రమ వల్ల సిద్ధించిన గెలుపు వాళ్ళను నిత్యం ఉత్సాహంలో ఉంచుతుంది. కాబట్టి ,ఒక ఎదురు దెబ్బ తగిలినప్పుడు కుంగి పోరాదు. మనల్ని మనం అనుశీలన చేసుకుని, మన వైఫల్యాన్ని విశ్లేషణ చేసుకొని , దానిని ఒక ప్రేరణగా చేసుకుని నిలబడాలి .ముందడుగు వేయాలి.

పిల్లల శక్తులను బలహీనపరిచే అంశాలు కొన్ని ఉన్నాయి. వాటిని గమనించాలి. పాఠ్యేతర అంశాలకు పాఠ్యాంశాలకు మధ్య సమతుల్యతను పాటించాల్సిన అవసరం ఉంది. సమయాన్ని సక్రమంగా నిర్వహించుకుంటూ పరీక్షలకు తగిన విధంగా పాఠ్యేతర ఆసక్తులను సవరించుకుంటూ ఉంటే, ఒత్తిడి ఉండదు. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాల్సి ఉంటుంది . పిల్లల పాఠ్యేతర అంశాలను కేవలం గొప్పగా చెప్పుకోవడం కోసం మాత్రమే కోసం అని అనుకోరాదు .అలా చెప్పుకోవడం ఒక ఫ్యాషన్ అనుకోవడం కూడా ఒక పొరపాటే .పిల్లలు సమయపాలన చేస్తున్నప్పుడు పెద్దలు కూడా మద్దతును ప్రకటించాల్సి ఉంటుంది. పరీక్షలు ఎదుర్కోవడంలో వారికి మానసికమైన ఒత్తిడి లేకుండా సమయాన్ని సవ్యంగా వినియోగించుకునే లాగా తల్లిదండ్రులు కూడా సహకరించాలి. ఇది ఒక ముఖ్యమైన అంశం.

అంతేకాదు, మనం గమనిస్తున్నాం. మన చుట్టూ జీవితం మారిపోయింది. ఈ యుగం అంతా సాంకేతిక పరికరాలతో ముడి పడిపోయింది. ఒకరకంగా ఇది సాంకేతిక యుగం. మన జీవితంలో ఎన్నో అంశాలు సాంకేతిక పరికరాలతో ఎంతగా ముడి పడిపోయి ఉన్నాయో మనం చూస్తూనే ఉన్నాము. ఆధునిక జీవితంలో సాంకేతిక పరికరాలు లేకుండా గడపడం రోజు రోజుకి కష్టతరం అయిపోతుంది. అయినా కూడా సాంకేతిక వినియోగాన్ని నియంత్రించుకో గలిగితే ఆ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడానికి వినియోగించుకోవచ్చు. కుటుంబ సభ్యులతో గడిపినప్పుడు మానసికమైన ఒత్తిడి తగ్గుతుంది. పిల్లలకు కూడా తల్లిదండ్రులతో గడిపిన కాలం ఒక మానసికమైన బలాన్ని శక్తిని కూడాఇస్తుంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లలకు తోడుగా ఉండడం ఎంతో బలాన్ని ఇచ్చే అంశంగా గుర్తించాలి.

ఇక్కడ ఇంకో విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి .సాంకేతికత సహాయం సవ్యంగా తీసుకోవాలి. విద్యా రంగంలో సాంకేతికతకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆధునిక విద్యా రంగంలో సాంకేతికత ఎంతో సహాయకారిగా ఉంటుంది కూడా. ఒక సాంకేతిక పరికరం ద్వారా విద్యను అభ్యసించేటప్పుడు విద్యార్థి దానిని సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యమైన అంశం. మనసుకు ఉన్న సహజ లక్షణం దృష్ట్యా అభ్యసన కాలంలో మనసు అటూ ఇటూ ఊగుతూ ఉంటుంది. చేతికి దొరికిన సాంకేతిక పరికరాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉంటుంది. పరికరాన్ని సద్వినియోగం చేసే లాగా మార్గదర్శనం చేయాలి. దుర్వినియోగం చేస్తే వారి అది సమయాన్ని దోచుకోవడం మాత్రమే కాకుండా దొరికే విద్యా వనరులను కూడా దొరక కుండా చేస్తుంది. ఎంతో విలువైన విద్యా విషయాలకు దూరం చేస్తుంది .ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. అనుభవజ్ఞులైన తల్లిదండ్రుల మాటలు ఆలకించాలి కూడా. తల్లిదండ్రులు ఒక పరికరాన్ని పిల్లల చేతికి ఇచ్చినప్పుడు కాస్త గమనించుకుంటూ ఉండడం కూడా మంచిది.

అలాగని వారిని భయ పెట్టరాదు. వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయరాదు. ఏ పని సాధించడానికి అయినా ఆత్మవిశ్వాసం అవసరం. విజయం సాధించిన వారిని గుర్తిస్తే వారు ఎంతో ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేయడం కనిపిస్తుంది. అంటే సంకల్పంలో ఎప్పుడూ విశ్వాసం ఉండాలి. ధైర్యం ఉండాలి. సాధించగలను అన్న నమ్మకం ఉండాలి .సంకల్పబలం ఉండాలి .అది కీలకమైన అంశం. విద్యార్థి పరీక్ష హాల్లోకి వెళ్తున్నప్పుడు మనసుకు ఎలాంటి ఒత్తిడిని ఉంచుకోకూడదు. పూర్తి ఆత్మవిశ్వాసం తోనే ముందడుగు వేయాలి. విద్యార్థులు తమకు తామే ప్రేరణ కలిగించుకోవాలి.నేను రాయగలను ఈ విషయం నాకు బాగా తెలుసు- అని మనసుకు చెప్పుకోవాలి. మనం గమనిస్తే రోదసిలోకి ఒక రాకెట్ ను పంపుతున్న శాస్త్రజ్ఞులు విశ్వాసంతో, చిత్తశుద్ధితో జయాపజయాలను సమంగా స్వీకరించి ముందడుగు వేస్తారు. విద్యార్థులు ఇలాంటి విషయాలను గమనించాలి .చేయాల్సిన ప్రయత్నం మనం బాగా చేయాలి. చేసే ప్రయత్నంలో రాజీ పడకూడదు. చిత్తశుద్ధి ఉండాలి. అలా ఉన్నప్పుడు సాధించడం సులభమే. ఒకవేళ ప్రయత్నంలో మనం సాధించలేకపోతే –నిరాశ పడకూడదు. నేను సాధించగలను– అని ధైర్యం పుంజుకుని రెండవసారి సాధించగలనని ఎప్పటికప్పుడు మనో నిబ్బరాన్ని పెంచుకుంటూ ఉండాలి. దానివల్ల ఒత్తిడి పడకూడదు. ఒత్తిడి లేనప్పుడు పనులను సవ్యంగా చేయగలరు.మరో మాట. తల్లితండ్రులు కానీ ఉపాధ్యాయులు కానీ తమ అంచనాలతో విద్యార్థుల మనసుపై వారి ఆలోచనలపై ఒత్తిడిని పెంచకుండా చూడాలి. పరీక్ష అన్నది విద్యార్థి జీవితంలో ఒక భాగం మాత్రమే. అదే జీవితం కాదు. మార్కుల వలన జీవితాన్ని నిర్ణయించుకోవడం సరైనది కాదు. పరీక్షలో ఉత్తీర్ణులు కావడం అన్నది జీవన గమనంలో ఒక దశ. అంతే. అది జీవన పరమార్థం గా భావించి అది లేని నాడు జీవితమే లేదు అనుకోవడం తప్పు. దానివల్ల లేనిపోని ఒత్తిడి విద్యార్థులపై పడుతుంది. అందుచేత విద్యార్థుల అంతర్గత శక్తిని గమనించాలి. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాలి .ఎప్పటికప్పుడు వారిలో ప్రేరణను కలిగిస్తూ ముందడుగు వేయించ గలగాలి.

పరీక్షలను పండుగలాగా భావించాలి. మనం ఏమి నేర్చుకున్నామో తెలుసుకోవడానికి పరీక్ష అన్నది ఒక అవకాశం . ఆ అవకాశం నుంచి మనం ఎంత నేర్చుకో గలిగాము, ఎంత నేర్చుకోవలసి ఉందో తెలుసుకుంటాం. అంటే ఒకరకంగా మన గురించి మనం తెలుసుకోవడానికి మన జ్ఞాన స్థాయిని మనం గుర్తించడానికి పరీక్ష మనకు ఒక అవకాశం ఇస్తుంది. అది ఒత్తిడి కాదు. విద్యార్థి జీవితంలో వచ్చే పండుగ.



- డా. పి.ఆర్ హరినాథ్,
తెలుగు ఆచార్యులు ,
రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
NCERT,మానస గంగోత్రి మైసూరు



## జేపీసీ చైర్మన్‌ను కలసిన ఉద్యమ కారులు

**ఇబ్రహీంపట్నం,వెలుతురు:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో నూతనంగా గవర్నర్ కోటలో తెలంగాణ రాష్ట్ర జేపీసీ చైర్మన్ కోదండరాం ఎమ్మెల్సీగా వచ్చిన సందర్భంగా వారి నివాసంలో రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాద్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల రంగారెడ్డి జిల్లా, కోదండరాం సార్ కి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పినారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో జేపీసీ చైర్మన్‌గా తెలంగాణ మార్చ్, సకలజనుల సమ్మె, పల్లె పల్లె పట్టాల పైకి, సడక్ బంద్, మొదలైన కార్యక్రమాలు చేసి తెలంగాణ ఉద్యమం సాధించడంలో కీలక పాత్ర పోషించిన కోదండరాం కృషి వెలకట్టలేనిదని అన్నారు.

## శ్రీ నాగార్జున స్టార్ కిడ్స్ విద్యాలయ హై స్కూల్లో సైన్స్ ఫెయిర్...

**కూకట్‌పల్లి, వెలుతురు:** 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ లోని శ్రీ నాగార్జున స్టార్ కిడ్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ కరస్పాండెంట్ కమలాకర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా పిల్లలకు సబ్జెక్టు మీద అవగాహన పెంచుకునే అవకాశం ఉందని పిల్లలకు స్కూల్ టీచర్స్ పేరెంట్స్ వారికి ఇంట్రెస్ట్ ఉన్న రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు టీచర్స్, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

**బీసీ సేన జాతీయ అధ్యక్షులు భర్క కృష్ణ యాదవ్.**

**శంకర్‌పల్లి మండల అధ్యక్షునిగా కావలి రవీందర్ నియామకం.**

**శంకర్‌పల్లి జనవరి 27(వెలుతురు) :** బీసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ,ఆర్థికంగా కానీ విద్యాపరంగా గాని అభివృద్ధి చెందాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు భర్క కృష్ణ యాదవ్ అన్నారు. శనివారం రోజు శంకర్పల్లి మున్సిపల్ పరిధిలో గల అతిథి గృహంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్పల్లి మండల బీసీ సేన అధ్యక్షునిగా సంకేపల్లి గ్రామానికి చెందిన కావలి రవీందర్ ని నియమించారు. ఈ సందర్భంగా భర్క కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీలు ఐక్యతగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడం నా ధ్యేయమని అన్నారు.



మండల అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ తన పైన నమ్మకంతో నాకు ఈ బాధ్యత ఇచ్చినందుకు బీసీ సేన అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే బీసీల సమస్యపై తనవంతుగా నిరంతరం పోరాటం చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ ముదిరాజ్ , శ్రీకాంత్ ముదిరాజ్, రాజేష్ గౌడ్, ప్రశాంత్, మౌనేష్, నరేష్, కుమార్, కన్న, సుధాకర్ గౌడ్, శంకర్ గౌడ్, శ్రీనివాస్, విక్రమ్, మల్లేష్, శ్రీకాంత్, కిషోర్, శ్రీశైలం గౌడ్ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియు) శంకర్‌పల్లి మండల క్యాలెండర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి జనవరి 27 (వెలుతురు): శంకర్‌పల్లిలో ఉన్న ఆదర్శ పాఠశాల ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2024 క్యాలెండర్‌ను చేవెళ్ల నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఏనుగంటి మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. సంఘం యొక్క క్యాలెండర్



ను శంకర్ పల్లి మండలం పి ఎస్ సి సి డైరెక్టర్ అయిన కాడి గారి రాజశేఖర్ రెడ్డి దాతగా చేయుతను అందించారు. ఈ కార్యక్రమానికి గాను మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎండి. తాహెర్ అలీ, మండల అధ్యక్షులు జి. నాగేష్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు అయిన వనజ రెడ్డి, జిల్లా కౌన్సిలర్ జయసింహారెడ్డి, సిహెచ్ యాదయ్య, శ్రీనివాస్, మండల ఆర్థిక కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి ఎస్.కె రియాజుద్దీన్, మహిళా కార్యదర్శి సదాలక్ష్మి, కవిత, రాజేశ్వరి, జ్యోతి, నౌశీన్ సుల్తానా, కౌసర్, జ్యోతి, లలిత, సుకన్య, ఝాన్సీ, కృష్ణవేణి, బాల తెరిసా,పద్మ, సరిత, మనీలా, ప్రణీత, సుగుణ, అనిత, సంతోష, కవిత మరియు ప్రశాంత్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్, ఖాజా, దాసు, సత్తయ్య మొదలు వారు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుంది..

**ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం..**



**కూకట్ పల్లి వెలుతురు:** పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ అన్నారు. శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గాంధీ భవన్ లో కార్యవర్గ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ ను పీసీసీ వైస్ ప్రెసిడెంట్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా అద్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, కాల్వ సుజాత, భవానీ రెడ్డి, సంధ్యా రెడ్డి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుజాత పాల్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులకు టిపిసిసి అధికార ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అన్నారు. అనంతరం సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నేడు మన ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందని, దగాపడ్డ తెలంగాణ ప్రజలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

## తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి.యు.టీ.ఎఫ్) క్యాలెండర్ ఆవిష్కరణ

**శంకర్‌పల్లి జనవరి 27 (వెలుతురు):** శంకర్పల్లి మండల మానవ వనరుల కేంద్రంలో టి పి.సీ.సి. జనరల్ సెక్రెటరీ ఏలుగంటి మధుసూదన్ రెడ్డి, పి ఎ సి ఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్ రెడ్డి, టి యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునందన్ రెడ్డి, ఎమ్ ఈ ఓ సయ్యద్ అక్బర్ టియుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి యు టి ఎఫ్ శంకర్ పల్లి మండల శాఖ అధ్యక్షులు ఏ. సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ ని నియమించాలని, ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలని, పెండింగ్ లో ఉన్న డి. ఏ .లను విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే శంకర్పల్లి మండల ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస చారి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డి.ఎ.లను ప్రకటించాలని స్పౌస్ ఉపా ధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ఎస్జిటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని, పండిత,పీ.ఈ.టి లకు ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగినది.



ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి మునీర్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ,మండల గౌరవ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వరరావు, సహాధ్యక్షులు రఫీక, గౌరవ సలహాదారులు వి. శ్రీనివాస్ రాజు సభ్యులు మోహన్ రెడ్డి , జగదీష్, వరప్రసాద్, రాము శర్మ , మొగులయ్య, రాజు, కవిత, కాంచన లక్ష్మీ, ధనలక్ష్మి, ఉమామహేశ్వర్, మదుర స్వప్న, జ్యోతిర్మయి, గిరిజా రెడ్డి, యం.విజయలక్ష్మి, పల్లవి, సరిత, వీణా, ప్రీతి, జమున, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్రస్థాయి బస్సు జాత ఉప్పల్ డిపో దగ్గర ఘన స్వాగతం.

**స్వేచ్ఛ సమానత్వం సమాజ మార్పు కళా రంగ సమస్యల సాధన కోసం.**

**ప్రజా సమస్యలను పరిష్కరించండి - పల్లె నర్సింహ తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి కార్యదర్శి.**

**మేడిపల్లి, వెలుతురు :** మేడిపల్లి మండలం లో ఉప్పల్ బస్ డిపో ముందు తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్రస్థాయి బస్సుజాతకు మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఘన స్వాగతం పలుకుతూ హైదరాబాద్ నుంచి హనుమకొండ వరకు జరిగే ఈ బస్సు జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రచ్చ కిషన్ మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్రంలో జనవరి 27, 28 తేదీలలో స్వేచ్ఛ, సమానత్వం, సమాజ మార్పు, కళారంగా సమస్యల సాధన కోసం ప్రజా సమస్యల పరిష్కారం ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ మద్దుమ్, సురవరం ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు, కాళోజి నారాయణరావు, అమర కళాకారుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తూ సభలో, ర్యాలీలు జరుగుతాయి కావున కవులు, కళాకారులు, అభ్యుదవాదులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష & కార్యదర్శులు మణికంఠ & పుట్ట లక్ష్మణ్ సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు వి బి బాలరాజ్ ,ప్రజానాట్యమ జిల్లా అధ్యక్షురాలు కే ప్రమీల, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి సిహెచ్ మాధవి, బి కే ఎం యు మండల కార్యదర్శి కే మహాలక్ష్మి, A రమా తార, దండు మదర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, చిన్నబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నా విజయానికి కష్టపడిన అందరికీ పేరుపేరునా శిరస్సు వంచి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట టౌన్, వెలుతురు జనవరి 27:** సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల కృతజ్ఞత సభలో మాట్లాడుతూ మీరే నన్నుగా భావించుకని 82 వేల భారీ మెజారిటీతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. కార్యకర్తలు నాయకులు సర్పంచులు బూత్ కమిటీ సభ్యులు అక్కాచెల్లెళ్లు కళాకారులు టీమ్ వర్క్ చేసి నన్ను గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.8శాతం ఓట్లతో మాత్రమే ఓడిపోయాం మరో 4 లక్షల ఓట్లు వచ్చివుంటే మనమే అధికారంలోకి వచ్చేవాళ్లం ఓడిపోయినందుకు బాధపడాల్సిన అవసరం లేదు తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాం మనది ఉద్యమ స్ఫూర్తి రైతు బంధు రైతు బీమా పథకాలను అనుకున్నంత ప్రచారం చేయలేకపోయాం మనం చేసిన మంచి పనులను చెప్పుకోవడంలో వెనకబడ్డాం ఇప్పుడు మనముందు మరింత బాధ్యత ఉంది తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకోవాలి ప్రజల సంక్షేమానికి కృషి చేయాలి కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చింది ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదు డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ ఆ హామీ నిలబెట్టుకోలేదు

రైతు బంధు 15 వేలు ఇస్తామని 10 వేలు కూడా ఇవ్వడం లేదు ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు

200 యూనిట్ల లోపు కరెంటు ఉచితం అన్నారు కానీ బిల్లులు వస్తూనే ఉన్నాయి బిల్లులు సోనియా గాంధీ కడతారా? కోమటిరెడ్డి కడతరా?

మెగా డీఎస్సీ వడ్లకు బోనస్ నిరుద్యోగ భృతి తులం బంగారం ప్రతి హామీని పక్కనపెట్టారు మేం ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా



కల్యాణ లక్ష్మి వంటి ఎన్నో పథకాలను అమలు చేశాం కాంగ్రెస్ హామీలను తప్పించేందుకు అప్పుల సాకు చూపుతోంది రాష్ట్ర ప్రభుత్వ గ్యారటీ లేని అప్పులను కూడా చూపి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు లంకెబిందెలు దొరకలేదని అంటున్నారు పింఛన్ 4 వేలు చేస్తామని మాట తప్పారు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పింఛన్ 2వేలకు పెంచాం మన హయాంలోనే పింఛన్ 200 నుంచి 2 వేలకు పెరిగింది కేటీఆర్ దావోస్‌కు వెళ్తే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు మరి రేవంత్ దావోస్‌కు ఎందుకు వెళ్లాడు? కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారు 33 జిల్లాలను ఏర్పాటు చేసి పరిపాలను ప్రజలకు చేరువ చేశారు 60 ఏళ్లలో కాంగ్రెస్ వల్ల సాధ్యం కానిది కేసీఆర్ చేసి చూపించారు గోదావరి జలాలను అన్ని ప్రాంతాలకు తీసుకొచ్చారు రెండు పంటలు పండుతున్నాయి తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీజేపీ కాదు కాంగ్రెస్ కాదు ఒక్క బీఆర్ఎస్ మాత్రమే పార్లమెంటు ఎన్నికల్లో మనం కష్టపడి గెలవాలి కాంగ్రెస్ మెడలు వంచి హామీలను అమలు చేయించాలంటే మన ఎంపీలను పార్లమెంటుకు పంపాలి.



## పద్మశ్రీ గ్రహీతకు అపూర్వ శుభాకాంక్షలు...

మేడిపల్లి, వెలుతురు: ఏఐబీఎస్ఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ సోమ్లాల్ నాయక్ భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారాల భాషలోకి తర్జుమా చేసినందుకు సాహిత్య విభాగంలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా ఏఐబీఎస్ఏస్ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ నాయక్, అసోసియేట్ అధ్యక్షులు మోహన్ సింగ్,మోహన్ నాయక్ సెక్రెటరీ సలహాదారు మోహన్ నాయక్,రాష్ట్ర సెక్రటరీ బోడుప్పల్ కార్పోరేటర్ భూక్య సుమన్,ట్రెజరర్ సీతారాం నాయక్,ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్స్ రాంబాబు నాయక్,శంకర్,నాయకులు సూర్యనారాయణ, మాలు నాయక్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కళా సుబ్బారావు కల వేదికలో నటరాజ్ కూచిపూడి డాన్స్ అకాడమీలో నాట్య ప్రదర్శన

### రాపర్తి స్వాతిక గౌడ్ - క్రీత్య గౌడ్ అద్భుత కూచిపూడి నాట్య ప్రదర్శన

**వెలుతురు న్యూస్, నారాయణపూర్:**
శ్రీ త్యాగరాయ గానసభలో కళా సుబ్బారావు కళ వేదికలో కళ సుబ్బారావు జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని, నటరాజ్ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన, చేసిన చిన్నారులు.! అద్భుతమైన కళా ప్రదర్శనతో చూపరులను ,ఆకట్టుకొని నిర్వాహకులను మెప్పించిన చిన్నారులు స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్- ఉషశ్రీ కుమార్తెలు రాపర్తి స్వాతిక గౌడ్- క్రీత్య గౌడ్ చిన్నారులు అద్భుత కూచిపూడి ప్రదర్శనను, నిర్వాకులు పాఠశాల





ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.! చిన్నారుల ప్రదర్శన చూసిన స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సాంప్రదాయ ,నృత్యాల్లో పిల్లల్ని ప్రోత్సహించాలని, భారతీయ సాంప్రదాయాన్ని నిలబెట్టాలని. ! పాశ్చాత్తా సంస్కృతి నృత్యాలకు , పిల్లల్ని దూరంగా ఉంచి భారత సంస్కృతికి అద్దం పట్టేలా పిల్లల్ని పెంచాలని అన్నారు రాపర్తి సురేష్ గౌడ్

## నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

### ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి

**వెలుతురు న్యూస్, నారాయణపూర్:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కోతులపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోతులాపురం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మునుగోడు శాసన



సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రజాపాలన అంటే ప్రజల కోసమే అని ఎవరికి ఏ సమస్య ఉన్న అందరికి అందుబాటులో ఉంటానన్నారు..మీ గ్రామంలో గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు..ప్రత్యేకంగా బెల్టు షాపులు బంధు చేయాలని ప్రజాలకు సూచించారు.. బెల్టు షాపులను బంధు చేసి ఆడవారికి బహుమతిగా ఇస్తానన్నారు..

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొట్ట సత్తయ్య, ఎంపీపీ ఉమాదేవి, జెడ్పిటిసి వీరమల్ల భానుమతి, డి.ఈ బాలచందర్, ఎంపీడీవో రాములు, ఎంపీఓ నర్సింగరావు,ఏ.ఈ.జానయ్య, ఎంపిటిసి శివరాత్రి కవిత,ఉప సర్పంచ్ ఇద్దయ్య, పంచాయతీ కార్యదర్శి దశరథ, వార్డు సభ్యులు కొత్త కొమురయ్య, ఈదులకంటి పద్మ, సందీప్ కుమార్, పాలకుర్ల జయమ్మ, వల్లందాసు మల్లమ్మ, కురిమిద్ద అనసూయ, కారోబార్ నరసింహచారి, సిబ్బంది,గ్రామ ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జల్లాలో సల్ప భూప్రకంపనలు

**జహీరాబాద్, 27 జనవరి, వెలుతురు :**
స్వల్ప భూప్రకంపనలు సంభవించడంతో ప్రజలు భయాందోళన గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలో చోటుచేసుకుంది. న్యాల్కల్ మండల కేంద్రం తోపాటు ముంగి గ్రామంలో సాయంత్రం పూట భారీ శబ్దంతో సల్ప భూప్రకంపనలు సంభవించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.




దాదాపు 7 సెకండ్ల లోపు భూమి కనిపించిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘ టనలో ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంబగావించలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారులు స్వల్ప భూకంపంపై ఏఏ గ్రామాల్లో సంభవించింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.





## వచ్చే లోకసభ ఎన్నికల లోపే
# మిగతా హామీలు అమలు చేస్తాం..

- మైలారంలో వి.వో (మహిళ భవనం) ప్రారంభం.
- 2 గ్యారంటీలు అమలు చేసాం..
- మిగతా హామీలు త్వరలో అమలు చేస్తాం.
- మైలారం నుండి గన్నేరువరం తారు రోడ్డు నిర్మాణం చెప్పడతాం.
- గుండ్లపల్లి మీదుగా గన్నేరువరం కు బస్సు సౌకర్యం కల్పిస్తాం.
- గత పాలకులు గ్రామంలో అరాచకాలు సృష్టించారు,
- ఇప్పటి నుండి గ్రామ ప్రజలు ప్రశాంతంగా ఉండొచ్చు.
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

**గన్నేరువరం, వెలుతురు జనవరి 27:**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన వి. వో (మహిళా భవనం ) ను మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన మోసాలను, అరాచకాలను వివరిస్తూ మండలం లో గ్రామా లలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, గత ప్రభుత్వం ను ఘాటుగా విమర్శించారు గ్రామంలోని అరాచకాలు పెరిగాయి యువత



చెడు మార్గానికి అలవాటు పడ్డారు, రసమయి బాలకిషన్ వారి అనుచరులు గ్రామ సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం ను ఎన్నో ఇబ్బందులకు గురి చేసారు, మహిళా భవనం ఎప్పుడో నిర్మించినప్పటికీ, నియంతృత ప్రభుత్వం పోయి, ప్రజల ప్రభుత్వం వచ్చాకే మహిళా భవనాన్ని ప్రారంభిస్తానని గ్రామ సర్పంచ్ బిష్మించుకు కూర్చున్నాడని, అందుకే ఇన్ని రోజులు ఆపడం జరిగిందని. నేడు ప్రజల ప్రభుత్వం వచ్చింది కాబట్టి మనం ఘనంగా ప్రారంభించుకుంటున్నాం. గత ఎమ్మెల్యే స్థానిక నాయకులను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో ఇరికించి వారిని బెదిరించి చాలా ఇబ్బంది పెట్టాడన్నారు. ఇప్పుడు మన ప్రభుత్వంలో అలాంటివి ఏమీ ఉండవని అందరూ ప్రశాంతంగా జీవించేలా ఈ పరిపాలన ఉంటుందన్నారు. మండల కేంద్రం నుండి ఈ గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడుతామని ఆయన అన్నారు.

### బస్సు సౌకర్యం కల్పిస్తాం..

గ్రామంలోని స్థానిక మహిళలు గుండ్లపల్లి మీదుగా మాకు బస్సు సౌకర్యం కల్పించండి అని అడగడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో ఇటీవలనే మాట్లాడడం జరిగిందని వారు సానుకూలంగా స్పందించారని ఈ నెల అకారులోపే గుండ్లపల్లి మీదుగా బస్సును నడిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే కు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్వో బిక్షపతి, ఎంఈవో, ఎంపీడీఓ, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, గ్రామా సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం, పంచాయితీ కార్యదర్శి, ఊప సర్పంచ్ కరిష్మా జాని, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కామన్ సర్వీస్ సెంటర్లుగా పిఏసిఏస్‌లు...

- కామన్ సర్వీస్ సెంటర్లతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పౌరులకు నేరుగా ఈ-సేవలు
- విస్తరిస్తున్న సేవలతో పీఏసీఎస్ లు 13కోట్ల మంది రైతు సభ్యులకు లబ్ధి...

**కరీంనగర్ వెలుతురు జనవరి 27:**
దేశ వ్యాప్తంగా ఉన్న 30వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (పిఏసిఏస్) కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్సీ) మార్చేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ కో-ఆపరేటివ్ ట్రైనింగ్ (ఎన్సీసీటీ) శిక్షణ ఇవ్వనుందని ఎన్ సిసిటి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ ఎన్ టి శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ లో శ్రీనివాస్ మాట్లాడుతూ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్ సీ)గా నమోదు చేసుకున్న 30వేల మంది పీఎస్ఎస్ ఏ ఉద్యోగులకు ఫిబ్రవరి,మార్చి నెలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం తర్వాత ఈ పీఏసీఎస్ లు బ్యాంకింగ్,ఇన్సూరెన్స్, ఆధార్ అప్ డేట్స్, అన్ని గవర్నమెంట్ సిటిజన్ ఈ-సర్వీసెస్ వంటి అనేక అత్యవసర సేవలకు వన్ స్టాప్ షాప్ గా మారనున్నాయి. నేషనల్ కౌన్సిల్ ఫర్ కో-ఆపరేటివ్ ట్రైనింగ్ (ఎన్సిసిటి) అనేది సహకార మంత్రిత్వ శాఖచే ప్రోత్సహించబడిన స్వయంప్రతిపత్తి కలిగిన సొసైటీ. స్వల్పకాలిక సహకార పరపతి వ్యవస్థను (పీఏసీఎస్) ను బలోపేతం చేయడానికి కేంద్ర మంత్రి, కేంద్ర సహకార మంత్రి నాయకత్వంలో సహకార మంత్రిత్వ శాఖ అనేక చర్యలు చేపట్టింది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) సాధనాలతో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. సేవల పంపిణీలో పారదర్శకతను పెంచడంలో, నిత్యావసర సేవలను వారి ఇంటి ముంగిటకు తీసుకురావడం ద్వారా పౌరుల భారాన్ని తగ్గించడంలో సీఎస్సీ గణనీయమైన పాత్ర పోషిస్తుంది. 30వేల పీఏసీఎస్ లకు సిఎస్ సి వివిధ సేవలను అందించేందుకు వీలుగా సమగ్ర శిక్షణ కార్యక్రమం 2024ఫిబ్రవరి నెల నుంచి ప్రారంభం కానుందని ఎన్ సీసీటీ అధికారి తెలిపారు. ఎన్సీసీటీ (NCCT) సంబంధం ఉన్న సుమారు 80మంది మాస్టర్ ట్రైనర్లు భారతదేశంలోని 570జిల్లాల్లోని సుమారు 30వేల పీఏసీఎస్లకు, పీఏసీఎస్(PACs) ల ఆదాయాన్ని పెంచేందుకు వీలుగా ఫిబ్రవరి,మార్చి నెలల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీనివల్ల కోట్లాది మంది రైతులు, గ్రామీణ ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అధికారులు తెలిపారు. 28రాష్ట్రాల్లోని పీఎస్సీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సీఎస్ సీలు (CSC) అందించే సుమారు 3వందల సేవలపై కంప్యూటర్ సిస్టమ్స్ పై ఆచరణాత్మక శిక్షణ ఉంటుంది. తదుపరి నెలల్లో ఈ పీఏసీఎస్ ల నిర్వహణతో పాటు ఫాలోఅప్ లు కూడా ఉంటాయి. రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ (ఆర్సీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల (డిసీబీ) సహకారంతో పీఏసీఎస్ల సమీకరణ జరుగుతుంది. కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్సీ) పాత్రను స్వీకరించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) త్వరలో పౌరులకు బ్యాంకింగ్, బీమా నుంచి ఆధార్ అప్డేట్, న్యాయ సలహా వరకు అనేక రకాల సేవలను అందించనున్నాయి. వ్యవసాయ పరికరాలు,పాన్ కార్డులు, రైళ్లు, బస్సులు, విమానాలకు సంబంధించిన ట్రావెల్ బుకింగ్స్ వంటి వ్యవసాయోత్పత్తులకు ఇవి వన్ స్టోన్ షాపులుగా మారనున్నాయి. నాబార్డు ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 63వేల పీఏసీఎస్ లు పనిచేస్తున్నాయి, 50వేల మంది ఇప్పటికే సి ది ట్రైనింగ్ ప్రోగ్రామ్ గా నమోదు చేసుకున్నారు. ఇవి కామన్ సర్వీస్ సెంటర్లుగా (సిఎస్ సి) తమను తాము నమోదు చేసుకున్న 30వేల పిఏసిఎస్ ఏ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమంగా నమోదు చేసుకున్నాయన్నారు. ఆన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీలు) వీటిలో 30వేల యాక్టివ్గా సీఎస్సీ సేవలను అందిస్తున్నాయి. గ్రామీణ సమాజాలకు నిత్యావసర సేవలను మరింత చేరువ చేస్తున్నాయి. “మాస్టర్ ట్రైనర్స్” ద్వారా రాబోయే శిక్షణ పిఏసిఏస్ గా మారిన సిఏస్ సిల వద్ద సర్వీస్ డెలివరీ,సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. విస్తరిస్తున్న సేవలతో పీఏసీఎస్ లు 13కోట్ల మంది రైతు సభ్యులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా అదనపు ఆదాయాన్ని ఆర్జించి స్వయం సమృద్ధి ఆర్థిక సంస్థలుగా రూపాంతరం చెందుతాయి. 'సహకర్ సే సమృద్ధి' అనే ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతను నెరవేర్చేందుకు ప్రభుత్వం పీఏసీఎస్ లను సీఎస్ సీలుగా పనిచేసేందుకు అనుమతించింది. ఇందుకోసం కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీలు) ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నాబార్డ్, సీఎస్సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్, సహకార మంత్రిత్వ శాఖ, మధ్య, నమోదైన 30వేల పీఏసీఎస్ఏ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమ అవగాహన ఒప్పందం కుదిరిందని డాక్టర్ శ్రీనివాస్ వివరించారు.





## 34 మంది బాసర ట్రిబుల్ ఐటిలో ఎంపిక అయిన విద్యార్థులకు ఐ ప్యాడ్స్ పంపిణి చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట టౌన్, వెలుతురు జనవరి 27:**
సిద్దిపేట ఇందిరా నగర్ జడ్పి హెచ్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల కు స్నాక్స్ డిజిటల్ కంటెంట్ బుక్స్ బాసర ట్రిబుల్ ఐటిలో సీట్లు సాదించిన విద్యార్థులకు ఐప్యాడ్స్ పంపిణి చేయడం జరిగింది.

- నో అడ్మిట్ నుండి నో అడ్మిషన్ స్థాయి కి ఎదిగిన ఇందిరా నగర్ పాఠశాల
- మీకు ఉత్తరం పంపించా మీ పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి చదివించాలి

34 మందికి బాసర ట్రిబుల్ ఐటిలో సీట్లు రావడం సంతోషం ఇంట్లో పిల్లలు డిజిటల్ స్టడీ కొరకు నా స్వంత డబ్బులతో బుక్స్ ఇప్పించా నా జీతం నుండి సిద్దిపేట నియోజకవర్గంలోని పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ ఏర్పాటు చేపిస్తున్న సరిగ్గా ఆరేళ్ల క్రితం 300 మంది విద్యార్థులతో సాదాసీదాగా ఉన్న సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల నేడు అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలను పునికిపుచ్చుకొని 1280 మంది విద్యార్థులతో విజయపరంపర సాగిస్తున్నది కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లు డిజిటల్ క్లాస్ రూములు ఈ-లైబ్రరీతోపాటు ప్రత్యేక తరగతి గదులను నిర్మించారు ఇఫ్లూ యూనివర్సిటీ ఈ పాఠశాలను దత్తత తీసుకోవడంలో ఫలితంగా అంతర్జాతీయ భాషలను స్థానిక విద్యార్థులకు అవపాసన పట్టించేలా లాంగ్వేజ్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేసాము నూటికి నూరుశాతం ఎస్సెస్సీ ఫలితాలతోపాటు ఈ ఏడాది 34మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు ఈ పాఠశాల అంటే నాకు చాలా ఇష్టం ఏ కార్యక్రమం అయిన మొదటి ఇందిరా నగర్ స్కూల్ నుండే ప్రారంభిస్తా నేడు 10వ తరగతి విద్యార్థుల కు సాయంత్రం వేళ స్నాక్స్ పెట్టె కార్యక్రమం ఇక్కడి నుండే ప్రారంభం చేస్తున్న 34 మంది బాసర ట్రిబుల్ ఐటి లో సీట్లు సంపాదించారు అంటే ఆ ఘనత ఉపాధ్యాయులదే

10 వ తరగతి విద్యార్థుల తల్లితండ్రులకు విజ్ఞప్తి టీవీలు బంద్ చేయండి ఫోన్ లు వాడకుండా చుడండి ఉదయం 5 గంటలకె నిద్ర లేపి చదివించండి

మీ పిల్లలు నా స్వంత పిల్లల్లా అన్ని చేస్తున్నా చదివించే బాధ్యత మీ పై ఉంది సిద్దిపేట నియోజకవర్గం 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాదించాలి

# రైతులకు ట్రాన్స్ఫార్మర్ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే...

**గన్నేరువరం, వెలుతురు జనవరి 27:**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామ శివారు లో గల ఎస్ ఎస్ 3 అనే ట్రాన్స్ఫార్మర్ స్థలం మార్పు కోసం ఎన్నో ఏళ్ల నుండి అధికారుల చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారం కాకా, దాని పరిధి లోని రైతులు నానా అవస్థలుపడుతున్నారు. చుట్టూ పొలాల మధ్యన ట్రాన్స్ఫార్మర్ ఉన్నందున అది కాలి పోయిన, వేరే సమస్య వచ్చిన దానిని రోడ్డు వరకు తీసుకురావలంటే రైతులకు ప్రాణాల మీదికి వచ్చేది, సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ చెప్పు లు అరిగేలా తిరిగిన పరిష్కారం కాలేదు. స్థానిక రైతులు వోడ్నాల నర్సయ్య, బద్దం శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏ.ఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి తో మాట్లాడి సమస్య కు పరిష్కారం చూపారు. అనంతరం స్థానిక రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.



# బ్యాంకు ఉద్యోగులకు ఆటలతోనే మానసిక ప్రశాంతత

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట టౌన్, వెలుతురు జనవరి 27:**
సిద్దిపేట మినీ స్టేడియంలో డీసీసీబీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల మధ్య క్రికెట్ పోటీలను ప్రారంభించారు. హరీష్ రావు మాట్లాడుతూ ప్రతిరోజూ ఒత్తిడితో కూడుకున్న విధులు నిర్వహించే



బ్యాంకు ఉద్యోగులకు ఇలాంటి ఆటల పోటీలు మానసిక ప్రశాంతత కలిగిస్తాయి శారీరక దారుఢ్యం కూడా కలుగుతుంది ఉద్యోగులు వీలు దొరికినప్పుడల్లా క్రీడల్లో పాల్గొనాలి ఇతర జిల్లాల నుంచి సిద్దిపేటకు వచ్చే క్రీడాకారులకు కూడా పూర్తి సహకారం అందిస్తాం పోటీల్లో పాల్గొన్న అందరికీ అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



# సామాజిక భవనాలకు మన సిద్దిపేట ఆదర్శం

**- పద్మశాలీలకు అండగా ఉంటా**

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి 27:** సిద్దిపేటలోని కాళ్లకుంట కాలనీలో శనివారం రోజున పద్మశాలి సంఘ భవనాన్ని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రారంభించి మాట్లాడుతు సమాజ శ్రేయస్సుకు సామాజిక భవనాలకు మన సిద్దిపేట ఆదర్శంగా నిలుస్తున్నది 'పోపా' భవనాన్ని కోటి రూపాయలతో అభివృద్ధి చేసుకున్నాం సిద్దిపేట మినీ పద్మశాలి భవన్ నిర్మాణానికి గతంలో 50 లక్షలు మంజూరు చేశాను రెండు స్లాపులు పడ్డాయి మరల 50 లక్షల రూపాయలు మంజూరై ఉన్నాయి అని తెలిపారు పద్మశాలి భవనంలో పర్యావరణ హితమైన స్టీల్




సామగ్రి ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం పద్మశాలీలు ఉత్పత్తి చేసే వస్త్రాలను విక్రయించుకోవడానికి మోటార్ సైకిళ్లను అందజేశాను వారికి మరింత సహకారం అందిస్తాను సమాజం కోసం పాటుబడేవారందరికీ నా చేయూత తప్పక ఉంటుందన్నారు

ఈ కార్యక్రమంలో సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు వైస్ చైర్మన్ జంగిటి కనకరాజ్ కౌన్సిలర్స్ సంపత్ రెడ్డి మల్లికార్జున్ దాసరి శ్రీనివాస్ విటోబా బింగి రాజేశం సాయిరాం పద్మశాలి నేతలు కాముని రాజేశం ముదిగొండ శ్రీనివాస్ గోనె కృష్ణారి స్వర్గం రమేష్ చిప్ప ప్రభాకర్ లు పాల్గొన్నారు.




## ఎల్గోయిలో గ్రామంలో తాత్కాలికంగా

# నిర్మించుకొన్న ఇళ్లను జెసిబీలతో కూల్చివేత

**ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చివేసిన ఇళ్ళు, రేకుల షేడ్లు**

**సర్టిఫికెట్లు ఉన్న కూల్చివేయడం అన్యాయమంటున్న బాధితులు**

**అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు**

**బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు**

**జహీరాబాద్, 27 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం ఎల్గోయిలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఎల్గోయి శివారులో ఏర్పాటు చేసిన జాతీయ ఉత్పాదక పెట్టుబడి మండలి నిమ్జ్ లోని సర్వే నెంబర్ 125లో గ్రామస్తులు చేపట్టిన తాత్కాలిక ఇళ్లను రెవెన్యూ, పోలీసు అధికారులు జెసిబీలతో నేలమట్టం చేశారు. అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల వద్దకు చేరుకున్న అధికారులు కూల్చివేతను చడి చప్పుడు లేకుండా పూర్తి చేశారు. సొంత గ్రామ శివారులో నిర్మించు



కున్న తాత్కాలిక నిర్మాణాలు, పక్కా ఇళ్ల కూల్చివేతపై గ్రామస్తుల మండిపడుతున్నారు. ముప్పై ఏళ్ల క్రితం కేటాయించిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకుంటే కూల్చి వేశారని అధికారులపై గ్రామస్తుల ఆరోపణ గుప్పిస్తున్నారు. సర్టిఫికెట్లు ఉన్న కూల్చివేయడం అన్యాయమని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చివేయడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నిమ్జ్ కు సరిహద్దులను వెంటనే చూపించాలని గ్రామ సర్పంచ్ ఓం ప్రకాష్ పాటిల్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

**కూల్చివేతకు గురైన బాధితులను ప్రామర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు :**

ఎల్గోయి గ్రామంలో ఇండ్లు, రేకుల షెడ్ల ను కూల్చివేతకు గురైన బాధితులను జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. కూల్చివేతకు గురైన ఇండ్లను, రేకుల షెడ్లను ఆయన పరిశీలించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని అత్యుత్సాహం పనికిరాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్ముల విగ్రహాలకు దేవుళ్ళ ఆలయాలకు విలువ ఇవ్వడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి వర్యులు ఇల్లు లేనివారికి కులమతాలకు ఆదేశించినప్పటికీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ విధంగా చేయడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం, గ్రామ సర్పంచ్ ఓం ప్రకాష్ పాటిల్, పిఏసిఎస్ గౌస్, నాయకులు బండి మోహన్, శివప్ప, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్‌లు మరియు సిసి డ్రైనేజీ ఓపెనింగ్‌ల పంపిణి

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.పట్లోల సంజీవ రెడ్డి**

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 27:**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు కళ్యాణ లక్ష్మి చెక్ పంపిణీలో మరియు డ్రైనేజీ ఓపెనింగ్ పాల్గొన్న ఎమ్మెల్యే పట్లోల సంజీవ రెడ్డి కాంగ్రెస్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రజలకు కళ్యాణ లక్ష్మి చెక్ లు పంపిణీ చేయడం జరిగింది. గత ప్రభుత్వం లీడర్ లు ప్రజలకు నిర్లక్ష్యం ధోరణి తో అప్పిన చెక్ లు ప్రజా సంక్షేమం దృష్ట్యా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల అనుసరం కాంగ్రెస్ పాలనలో అందరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యం అని వారు తెలిపారు.



మండలం పార్టీ అధ్యక్షులు. బోజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు. స్వప్న శంకరయ్య స్వామి సర్పంచ్ లు. పిరప్ప ఎంపిటిసి .మహేశ్వర్ సెట్.యాదవ రెడ్డి మాజీ సర్పంచ్. జలీల్. కృష్ణ ఎస్సీ సెల్ అధ్యక్షులు. శ్యాం ప్రసాద్ ముదిరాజ్



కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి.ఎసప్ప. శివాజీ పాటిల్. విట్టల్ రెడ్డి. బాప్ పాటిల్.ఎంపీటీసీ లు తాసిల్దార్ .అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిమ్స్ సన్ షైన్ వైద్యులు డాక్టర్ శ్రీధర్ కస్తూరి గారి అధ్వర్యంలో

# ఐక్యమౌతున్న మున్నూరు కాపు

**వైద్య వృత్తిలో ఆదర్శం డాక్టర్ శ్రీధర్ కస్తూరి**

**నిరుపేదల పాలిట నిజమైన దైవం శ్రీధర్ కస్తూరి**

**మనసున్న మాధవునికి ఆత్మీయ సన్మాన సత్కారం**

**హైదరాబాద్ వెలుతురు జనవరి, 27:**
వైద్య వృత్తిలో ఆదర్శం నిరుపేదల పాలిట నిజమైన దైవం డాక్టర్ శ్రీధర్ కస్తూరి అని ప్రముఖులు పేర్కొన్నారు. మనసున్న మనిషి రూపంలో ఉన్న మాధవుడు డాక్టర్ శ్రీధర్ కస్తూరి అని ఆయనకు నేడు ఘనంగా ఆత్మీయ సన్మాన సత్కారం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. డాక్టర్ శ్రీధర్ కస్తూరి కిమ్స్ సన్ షైన్ హార్ట్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో విష్ణు జగతి సమక్షంలో ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. డాక్టర్ కస్తూరి శ్రీధర్ గారి ప్రమేయంతో తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులు ఒకే వేదిక మీదికి వచ్చి తమ ఐక్యత ను చాటుతున్నారు వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రజాప్రతినిధులు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ శ్రీధర్ కస్తూరి ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడుతూ కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్లో మంచి వైద్యం అందుతుందని, అన్ని జబ్బులకు అందుబాటులో డాక్టర్స్ ఉన్నానని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరిని సంప్రదించినచో మంచి వైద్య వైద్య సలహాలు సూచనలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ కస్తూరి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉంటే ఎటువంటి సమస్యకైనా నన్ను సంప్రదించవచ్చని తెలంగాణ స్టేట్ డాక్టర్స్ అందరూ నాతో కలిసి మెలిసి ఉంటరాణి మీకు మంచి వైద్యం అందించేందుకు సహాయపడతానని కిమ్స్






అండ్ సైన్ హాట్ ఇన్స్టిట్యూట్లో మంచి వైద్యం పరికరాలు డాక్టర్ అందుబాటులో ఉన్నారని మీకు ఎటువంటి ప్రాబ్లం ఉన్నచో నన్ను సంప్రదించవచ్చు. మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎంపీపీలపురం అధ్యక్షులు కల్లూరు హరికృష్ణ , డాక్టర్ నరేష్ బాబు, పుట్టం పురుషోత్తంరావు, తూప్రాన్ దంత వైద్యుడు డాక్టర్ కల్లూరి సంతోష్, కొరంటి మల్లేశం, విమలాకర్ రెడ్డి, తోట ముత్యాలు, పోల రవీందర్, మహేష్, బాలయ్య, మాజీ జడ్పీటిసి సింగం సత్తయ్య, నాయిని యాదగిరి, చల్లా నర్సింలు, గడ్డం ప్రశాంత్, కల్లూరి హన్మంత్ రావు, వర్గల్ మాజీ ఎంపిటిసి ముత్యాలు, నాయకులు యాదగిరి, చల్ల నరసింహులు, బద్ధం కిరణ్, బద్ధం మహేష్, డాక్టర్ చంద్రపాల్, డాక్టర్ విక్రమ్, సీఐ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సిగరెట్, ధూమపానం, మద్యపానంపై అవగాహన




**జహీరాబాద్, 27 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములో శనివారం స్వామి నారాయణ గురుకుల పాఠశాల యజ్యమణ్యం, విద్యార్థుల అధ్వర్యంలో మద్యం, పొగకు, సిగరెట్‌లపై చెడు విసనాలకు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టములోని శివాజీ విగ్రహం నుండి మొదలుకొని పట్టణంలోని లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ వరకు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు బస్ స్టాప్‌లో ఉన్న ప్రయాణికులకు పొగాకు, గుట్కా, మద్యంలకు పూర్తిగా దూరంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ రంగారెడ్డి మాట్లాడుతూ సమాజంలో చాలామంది చెడు అలవాట్లకు బానిశసలవుతున్నారని, దానివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా యువత కూడా ఈ అలవాట్లకు బానిసవుతున్నారని, దీని వల్ల సమాజంలో నేరాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమములో మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సిములు, నీల వెంకటేశం, విజయ్ కుమార్, వంశీ గొడ్కే, పాఠశాల




డైరెక్టర్ భీమారెడ్డి, ప్రిన్సిపల్ రంగారెడ్డి, కోఆర్డినేటర్ ఓం ప్రకాష్, భస్వరాజ్, నరేష్,అంజయ్య, సుమిత్ డేవిడ్, అజయ్, యోహాను విద్యా ర్థులు, తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోల సంజీవ రెడ్డి

**వెలుతురూ ప్రతినిధి కంగ్టి:**
సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రములో ఈ రోజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే పట్లోల సంజీవ




రెడ్డి కాంగ్రెస్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రజలకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేయడం జరిగింది. గత ప్రభుత్వ నాయకులు ప్రజలకు నిర్లక్ష్యం ధోరణితో అప్పిన చెక్కులను ప్రజా సంక్షేమంకోసం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి ఆదేశాల అనుసరం కాంగ్రెస్ పాలనలో అందరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యం అని వారు తెలిపారు, ఇట్టి కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షులు మల్ల రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజీ రెడ్డి, పండరినాథరావ్, షాదుల్ సాబ్ మాజీ ఎంపీపీ దామ నాగన్న, మాజీ జెడ్పిటిసి సర్దార్, పల్లవి పరుశరామ్ రాథోడ పెద్ద మల్లరెడ్డి, అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీఎన్జీఓఎస్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**మేడ్చల్ మల్కాజిగిరి వెలుతురు జనవరి 27:**
ఘనంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ మరియు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ డి.అరుణ్ కుమార్ గారి జన్మదిన వేడుకలు.

ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజ ప్రభుత్వ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారు గంజాయి , డ్రగ్స్ నిర్మూలన కు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ వారి అడుగు జాడల్లో నడుస్థమని మరియు ఎక్సైజ్ శాఖ అభివృద్ధికి పాటు




పడుతామని ఆశా భావం వ్యక్త పరిచారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అత్మీయులందరికి కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్ , తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు , తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్, ఎక్సైజ్ అధికారులు నరేందర్ గౌడ్ , భరత్, ముకుంద రెడ్డి, ధనరాజ్ గౌడ్ మరియు సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేటెడ్ పదవుల్లో బిసిలకు 50శాతం పదవులు

### సిఎం రేవంత్‌కు కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):**
నామినేటెడ్, కార్పొరేషన్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం పదవులు ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి వైసిపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్, దేవాదాయ కమిటీలు, ఇతర నామినెటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీలు మద్దతు ఇచ్చారని, పార్టీలోని సమర్థులైన నాయకులకు పదవులు ఇవ్వాలని కోరామన్నారు. వచ్చే బ్జడెట్‌లో బీసీలకు 20 వేల కోట్ల బ్జడెట్ కేటాయించాలని, ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజు మంజూరు చేయాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి బీసీ కుటుంబానికి 20 లక్షలు మంజూరు చేయాలని, మంత్రివర్గంలో 50 శాతం కోటా బీసీలకు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామని ఆయన తెలిపారు.

# కామారెడ్డిలో రోడ్డు విస్తరణ పనులు

### సొంతింటిని కూల్చిన ఎమ్మెల్యే రమణారెడ్డి





**కామారెడ్డి,జనవరి27(వెలుతురు):**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థులు కేసీఆర్, రేవంత్ రెడ్డిని ఓడించి సంచలనంగా మారిన బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రజా సేవలోనూ తన మార్కు చూపిస్తున్నారు. తన గొప్ప మనసు చాటుకున్నారు. నియోజవర్గంలో రోడ్డు విస్తరణ కోసం ఏకంగా తన సొంత ఇంటినే కూల్చేస్తున్నారు. దీంతో కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డిపై అంతటా ప్రశంసలు కురుస్తున్నాయి. కామారెడ్డిలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. దీంతో ఎమ్మెల్యే ఇంటి నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పు కోసం అడ్డుగా ఉన్న నిర్మాణాలకు అధికారులు నోటీసులివ్వనున్నారు. రోడ్డును విస్తరించడానికి అడ్డుగా ఉన్న వాటిలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నివాసం కూడా ఉంది. అలాగే రెండు సినిమా థియేటర్లు కూడా ఉన్నాయి. కాగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రమణారెడ్డి సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. కామారెడ్డి బరిలో నిలిచిన సీఎం అభ్యర్థులు కేసీఆర్, రేవంత్ రెడ్డిని ఓడించారు. బరిలో అగ్ర నేతలు ఉన్నప్పటికీ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రచారం చేసిన రమణారెడ్డి చివరికి విజయాన్ని అందుకున్నారు. కాగా ఎన్నికల ప్రచారం సమయంలో తన సొంత డబ్బులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని రమణారెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి రమణారెడ్డి గత కొన్నేళ్లుగా స్వచ్ఛంద సేవలో ప్రజలతో మమేకం అయ్యారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు పనులను చేపట్టారు. అందుకే ఆయనను కెసిఆర్, రేవంత్ రెడ్డిలు ఓడించలేక పోయింది.

# నేతల ఆక్రమణలో చెరువు శిఖాలు


### చెరువుల శిఖం ఆక్రమణలపై తేలని పంచాయితీ?

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):**
హైదరాబాద్ నగరంతో పాటు శివారుల్లో చెరువుల ఆక్రమణకు గురికావడం, కోర్టు కేసుల్లో ఉండడం వల్ల వాటి అభివృద్ధికి ఆటంకంగా మారింది. రియల్టరల దందాలకు చెరువులు మాయం అయ్యాయి. అనేక చెరువుల ఉనికి లేకుండా పోయింది. నగర చుట్టుపక్క ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో చెరువులను మింగుతున్నారు. శిఖం భూములు మొత్తం ఇప్పుడు అపార్ట్‌మెంట్లుగా, విల్లాలుగా మారాయి. గతంలో వర్షాలకు ఈ విల్లాలలు నీట మునిగిన సంగతి తెలిసిందే. దీనికితోడు స్థానిక నేతలు కబ్జాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతలపై ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, వారి అనుచరుల కబ్జాలపై ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇలా ప్రతినియోజకవర్గంలోనూ ఆరోపణలు ఉన్నాయి. సమారు 12 చెరువుల హద్దులు గుర్తించే విషయంలో కొందరు అభ్యంతరం తెలుపుతూ కోర్టులను ఆశ్రయించారు. కొన్ని చోట్ల ప్రభుత్వ సంస్థలు కూడా అడ్డ తగులుతండటం గమనార్హం. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో గుర్తించిన చెరువుల సుందరీకరణ పనులు జీహెచ్‌ఎంసీకి అప్పగించిన అనేక సమస్యలతో అవి ముందుకు సాగలేదు. అనుకున్నట్లుగా సుందరంగా తీర్చిదిద్దితే అనేక కాలనీలకు చెందిన ప్రజలకు ఆహ్లాద వాతావరణం ఏర్పడేది. పిల్లలు సాయంత్రంవేళ ఆడుకునేందుకు అవకాశం చిక్కేది.

అయితే ఈ అవకాశం నగరవాసులకు దక్కడంలేదు. చెరువుల్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు పూర్తి కావాల్సి ఉండగా అనేక చోట్ల పనులు నత్తలతో పోటీ పడుతున్నాయి. చెరువులకు సంబంధించి నిధుల కొరత కూడా కారణమవుతోందని తెలిసింది. చెరువులను కాపాడి సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

### యధావిధిగా మహిళలకు ఉచితం



**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):**
మేడారం జాతరకు వెళ్తే భక్తులకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ తెలిపింది. మహిళలకు ఉచిత ప్రయాణం కనుక భక్తుల రద్దీ పెరిగితే అదనపు సర్వీసులు కూడా సిద్ధం చేశారు. కోట్లాదిమంది భక్తుల నమ్మకానికి ప్రతిరూపం, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మేడారం జాతర.. తెలంగాణ కుంభమేలా?మరికొద్ది రోజుల్లో సాక్షాత్కారం కానుంది. మేడారం జాతర సందర్భంగా ప్రత్యేక బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత రవాణా కొనసాగనుంది. వీరి నుంచి ఛార్జీలు వసూలు చేయాలన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రతిపాదనను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తిరస్కరించారు. రాష్ట్ర బ్జడెట్‌కు సంబంధించి భట్టి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇటీవల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. వచ్చే మేడారం జాతర సందర్భంగా తిరిగే ప్రత్యేక బస్సుల్లో మహిళల నుంచి టిక్కెట్లు తీసుకుంటే సంస్థ ఆదాయం పెరుగుతుందని ప్రతిపాదించారు. దీనిపై భట్టి స్పందిస్తూ.. ఇది సరికాదని, మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించాలని స్పష్టం చేశారు. మేడారం మాత్రమే కాకుండా ఏ జాతర సమయంలోనూ మహిళల నుంచి ఛార్జీలు తీసుకోవద్దని ఆదేశించారు. ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరిగే మేడారం జాతరకు ప్రత్యేకంగా 6000 బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఒక్క హైదరాబాద్ నుంచే 2 వేల బస్సులు నడుపుతున్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు కౌంట్‌డౌన్ షురూ అయింది. కోట్లాదిమంది భక్తుల నమ్మకానికి ప్రతిరూపం మేడారం సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది కొత్త ప్రభుత్వం. స్థానిక ఆదివాసీ బిడ్డ సీతక్క మంత్రి కావడం, అదే జిల్లాకు చెందిన కొండా సురేఖ దేవాదాయ మంత్రిగా చార్జ్ తీసుకోవడం, ఈ రెండు స్పెషాలిటీల ప్రభావం ఈసారి మహా జాతరపై స్పష్టంగా కనిపించబోతోంది. వందకోట్లకు పైగా ఖర్చయ్యే జాతర కోసం ప్రభుత్వం ఇప్పటికే 70 కోట్లు మంజూరు చేసింది. ఈసారి జాతరకు ఐదు రాష్ట్రాల నుంచి కోటీ 50 లక్షల మంది భక్తులు వస్తారన్నది అంచనా. వీఐపీలు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలంటే జాతర నిర్వహణలో పోలీసులదే కీలక పాత్ర. పైగా.. .మావోయిస్టు యాక్షన్ టీమ్‌తో ముప్పు ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం అయ్యాయి.

# ఓయూ లేడీస్ హాస్టల్‌లో ఆగంతకుల దాడి

### విద్యార్థినుల ఆందోళనతో ఉద్రిక్తత

### సర్దిచెప్పిన పోలీసులు...ఆందోళన విరమణ

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):** ఉస్మానియా వర్సిటీ లేడీస్ హాస్టల్ లోకి శుక్రవారం రాత్రి ఆగంతకులు ప్రవేశించారని విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనతో వర్సిటీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఓయూ రిజిస్ట్రార్ వచ్చి నచ్చచెప్పినా విద్యార్థినులు వినలేదు. వీసీ వచ్చే వరకూ ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. అయితే, వర్సిటీని సందర్శించిన నార్త్ జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని విద్యార్థినులకు నచ్చచెప్పారు. వసతులు కల్పిస్తామని, భద్రతా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు. ఈ క్రమంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలోని లేడీస్ హాస్టల్‌లోకి శుక్రవారం రాత్రి ఇద్దరు ఆగంతకులు ప్రవేశించడం కలకలం రేపింది. ముగ్గురు దుండగులు గోడ దూకి హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించి.. విద్యార్థినులపై దాడికి ప్రయత్నించారు. అమ్మాయిలు అప్రమత్తం కావడంతో వాళ్లు తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలోనే ఇద్దరు పరారు కాగా, మరో వ్యక్తి విద్యార్థినులకు దొరికిపోయాడు. అతన్ని పట్టుకొని చున్నీతో కట్టేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడికి చేరుకోవడంతో నిందితున్ని వారికి అప్పగించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా విద్యార్థినుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. హాస్టల్లో రక్షణ కరవైందని, సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని విద్యార్థినులు నిరసనకు దిగారు. వెంటనే అక్కడికి చేరుకున్న ప్రిన్సిపాల్ స్టూడెంట్స్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా విద్యార్థినులు వినలేదు. హాస్టల్లో ఆగంతకులు చొరబడటంపై తమకు రక్షణ లేదంటూ భారీగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. సీసీ టీవీలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వీసీ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో వర్సిటీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థినులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరకు డీసీపీ హామీతో విద్యార్థులు శాంతించి.. ఆందోళన విరమించారు.






# పాతబస్తీలో ఘోర రోడ్డు ప్రమాదం

## రౌడీషీటర్ శ్రీకాంత్ సింగ్ దుర్మరణం

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):** పాతబస్తీ చదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఘోరా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాచిగూడకు చెందిన రౌడీ షీటర్ శ్రీకాంత్ సింగ్ మృతి చెందాడు. సవేరా హోటల్ సమీపంలో ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి లారీని ఢీ కొట్టి.. లారీ చక్రాల కింద పడి శ్రీకాంత్ సింగ్ మృతి చెందాడు. సమాచారం అందుకుని సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కాచిగూడ నివాసి శ్రీకాంత్ సింగ్ స్థానిక కాచిగూడ రౌడీ షీటర్.. ఇతనిపై సుల్తాన్ బజార్, లేక్ పోలీస్ స్టేషన్, చైతన్యపురి పీఎస్‌లలో కేసులు ఉన్నాయి. శ్రీకాంత్ ఒళ్ళంతా పచ్చ బొట్లు వేయించుకున్నాడు. ఇతనికి సోషల్ మీడియాలో, ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలోవర్స్ ఉన్నారు.. రోడ్లపై బైక్ స్టంట్స్ చేస్తూ ఫాలోవర్స్‌ను పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఈరోజు లారీ చక్రాల కింద పడి చనిపోయాడు. మృతుని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎంట్రెన్స్ టెస్ట్‌లకు కన్వీనర్ల నియామకం

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):** తెలంగాణలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే పలు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్)లకు కన్వీనర్లను ఉన్నత విద్యా మండలి నియమించింది. ఆయా సెట్లను నిర్వహించే వర్సిటీల వివరాలనూ వెల్లడించింది. టీఎస్ ఈఏపీసెట్, పీజీఈసెట్ లను జేఎన్టీయూకు, ఐసెట్ కాకతీయకు, ఈసెట్, లాసెట్ లను ఉస్మానియాకు, ఎడ్ సెట్ మహాత్మాగాంధీ వర్సిటీకి, పీఈసెట్ ను శాతవాహన వర్సిటీకి కేటాయించింది. ఈఏపీసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ దీన్ కుమార్‌ను, ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరాం వెంకటేశ్‌ను ఈసెట్ కన్వీనర్‌గా, ఓయూ లీగల్ సెల్ డైరెక్టర్ విజయలక్ష్మిని లాసెట్ కన్వీనర్‌గా నియమించారు. పీజీఈసెట్ కన్వీనర్ గా అరుణ కుమారి, ఐసెట్ కన్వీనర్‌గా నరసింహాచారి. పీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ నియమితులయ్యారు

# పుల్లయ్యకుంటలో అక్రమ కట్టడాల కూల్చివేత

**వరంగల్,జనవరి27(వెలుతురు):** వరంగల్ లోని పుల్లయ్య కుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలను బల్దియా అధికారులు కూల్చివేశారు. పార్టీ కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు జరిగాయని వరంగల్ బల్దియా అధికారులకు, పోలీసులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా, సీపీవో వెంకన్న



నేతృత్వం లో అధికారులు ఇవాళ తెల్లవారు జామున అక్రమ నిర్మాణాలను తొలగించారు. కాగా అక్రమ నిర్మాణాలపై బల్దియా అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. హనుమకొండలోని కాపు సంఘం కాలనీలో అనుమతి పొందినా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బిల్డింగ్‌ను సైతం అధికారులు తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు..

# రంగారెడ్డి జిల్లాలో దారుణం

## తండ్రిని, మేనమామను చంపిన దుర్మార్గుడు

**రంగారెడ్డి,జనవరి27(వెలుతురు):** రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. ఇనుప రాడ్ తో సొంత తండ్రిని.. మేనమామను దారుణంగా నరికి చంపాడు. దీంతో స్థానికులంతా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో కుటుంబ తగాదాల్లో భాగంగా తండ్రితో పాటు మేనమామపై ఇనుప రాడ్ తో కొడుకు రాకేష్ దాడి చేశాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిచారు. చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాకేష్ ను అదుపులోకి తీసుకొని.. విచారిస్తున్నారు పోలీసులు. ఆస్తి తగాదాల వల్లే రాకేష్ ఇలా చేశాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇంజినీరింగ్ విద్యార్థిని

# అనుమానాస్పద మృతి

**విజయవాడ,జనవరి27(వెలుతురు):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శనివారం ఉదయం హాస్టల్ గదిలో ఉరి వేసుకుని కనిపించగా.. తోటి విద్యార్థినులు వాడ్గన్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని విలపించారు. విద్యార్థిని మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా.. తల్లిదండ్రులు, బంధువులు అడ్డుకున్నారు. తమ కుమార్తె మరణానికి కారణాలు చెప్పాలంటూ అడ్డుపడ్డారు. వసతి గృహంలో వా÷-డ్గ÷న్ పర్యవేక్షణ ఏదీ అంటూ నిలదీశారు. అనంతరం పోలీసులు సద్ది చెప్పడంతో శాంతించారు. కాగా, శుక్రవారం అర్ధరాత్రి వరకూ మృతురాలు తన సోదరుడితో సంభాషించినట్లు తోటి విద్యార్థినులు పోలీసులకు తెలిపారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన విద్యార్థిని మైలవరం కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రమేష్, సీఐ కృష్ణకిశోర్ వెల్లడించారు.

# మహిళపై అసభ్యంగా ప్రవర్తన

## నడిరోడ్డుపై చితకబాదిన దుండగుడు

**అనంతపురం,జనవరి27(వెలుతురు):** జిల్లాలోని బ్రహ్మసముద్రం మండలం పాల వెంకటాపురం గ్రామంలో మహిళపై గ్రామస్థుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ఆమె గట్టిగా నిలదీసింది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆ వ్యక్తి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. పాల వెంకటాపురం గ్రామానికి చెందిన నటరాజు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయంలో నిలదీయడంతో లక్ష్మీపై అతను దాడి చేశాడు. ఈ దృశ్యాలను అక్కడే ఉన్న వ్యక్తి చిత్రీకరించాడు. ఈ వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు రియాక్ట్ అయ్యారు. ఈ ఘటన జరిగినట్లు పోలీసుల దృష్టికి రావడంతో బ్రహ్మసముద్రం ఎస్సై పరశురాముడు ఆధ్వర్యంలో పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఘటనా స్థలానికి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. దాడి జరిగిందని నిర్ధారించకున్నారు. లక్ష్మీపై దాడి చేసిన నటరాజుపై బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పరశురాముడు తెలిపారు.

గాయపడిన మహిళను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ఎస్సై పేర్కొన్నారు. శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ నియోజకవర్గం అయినా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఈ దారుణం జరిగింది. నిందితుడు వైసిపి గ్రామ కన్వీనర్ కావడంతో ఈ కేసులోకి రాజకీయం ఎంటర్ అయింది. తన కోరిక తీర్చాలంటూ వికృత చేష్టలకు దిగడంతోనే ఆమె తిరగబడిందని అంటున్నారు. బాధితురాలు టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం సాయంత్రం బలవంతం చేయబోయాడని స్థానికులు చెబుతున్నారు. ఆమె ఎదురు తిరిగింది. తన మాట వినలేదని ఆమెను నడిరోడ్డుపై చితకబాదాడు. గ్రామస్థులు అడ్డు వస్తున్నా వినలేదు. జుట్టు పట్టి నేలకేసి బాదాడు. గ్రామస్తులు కలగజేసుకుని విడిపించారు. అప్పటికే గాయాల పాలైన బాధితురాలిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బ్రహ్మసముద్రం పోలీసులకు మహిళ ఫిర్యాదు చేసింది . నటరాజ్ తనకు పరిచయం కూడా లేదని అయితే తనను బలవంతం చేయబోయాడని సదరు బాధిత మహిళ మీడియాకు తెలిపింది.

# యుద్ధం మొదలైంది..సింహాల్లో కదలాలి

## బిఆర్ఎస్ విజయం లక్ష్యంగా పనిచేయాలి

## కార్యకర్తలకు జగదీశ్ రెడ్డి పిలుపు

**నల్లగొండ,జనవరి27(వెలుతురు):** 'సూర్యాపేట నుంచి మళ్ళీ యుద్ధం మొదలైంది. బీఆర్ఎస్ గెలుపు. పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి విజయం సాధించాలి. అందుకోసం కష్టపడాలి. కాంగ్రెస్ హామీలపై ప్రజల పక్షాన నిలబడాలి. ప్రభుత్వాన్ని నిలదీయాలి. ఉద్యమంలో లాగా సింహాల్లా కదలాలని మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరితూగని వాళ్లు ఆయనపై విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమ కాలం నుంచే కుట్రలు చేసిందని ఆయన ఆరోపించారు. నల్లగొండలో శనివారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల బాధలు తెలిసిన నేత కేసీఆర్ అని, అందుకే కరెంట్ కోతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దామని చెప్పారు. ధాన్యం, ఆహార ఉత్పత్తుల్లో అగ్రగామిగా తీర్చిదిద్దారని, తెలంగాణను తన కుటుంబంగా భావించి కష్టపడ్డారని అన్నారు. పాలకులకు ప్రజలపట్ల ప్రేమ ఉంటే ఏదైనా సాధ్యం.

అందుకు కేసీఆర్ నిదర్శనం. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు.. కాంగ్రెస్ '420' హామీలు ఇచ్చింది. మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి జుట్ల పంచాయతీ పెట్టారు. మిగతా హామీల గురుంచి అడిగితే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. బూతులు, ఎదురు దాడికి భయపడే వాళ్ళు ఎవరూ లేరు. వీళ్ల పదవుల కోసం హైకమాండ్‌కు బానిసలుగా మారారు. ఎన్ని




రోజులు అబద్దం చెప్తారు..? కేసులు చాలా చూసి చూసి వచ్చాం. బయపడేది లేదు. కేసీఆర్ కాలి గోటికి సరిపోని వాళ్లు ఆయన మీద మాట్లాడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేం కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టలేదు. గతంలో కేసులు పెట్టించిన కాంగ్రెస్ నేతలను ప్రజలు శంకరగిరి మాన్యాలు పట్టించారు. సాగర్ ఎడమ కాల్వ నీటిని తరలించుకుపోతుంటే పట్టించు కోలేదు. కృష్ణ జలాలను తరలించుకుపోతుంటే హారతులు పట్టిన ద్రోహులు మీరు. హామీలు నెరవేర్చడం చేత కాక కేసీఆర్‌పై నెపం నెడుతున్నారు. మాతో పెట్టుకోవద్దు. నికార్సైన ఉద్యమకారులం మేం. నేను వ్యక్తిగత ఆరోపణలకు దిగితే రోడ్ల మీద తిరగలేవు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతరా..? మంత్రి పదవి ఇచ్చింది అందుకేనా..? ఇంత అహకారపూరిత మాటలు ఎందుకు..? రైతులకు డబ్బులు ఇవ్వలేనప్పుడు కాళ్ళు పట్టుకుని చెప్పుకోవాలి. బీఆరెస్ తెలంగాణ ప్రజల కోసం నిరంతరం నిలబడుతది. నల్లగొండ ప్రజల చైతన్యం ముందు మీ అహంకారం నిలబడదు. అధికారం అడ్డం పెట్టుకుని ఏదో చేయాలనుకుంటే ఇక్కడ సాగదు' అని జగదీష్ రెడ్డి విమర్శించారు. రైతుబంధు పడట్లేదు. కరెంట్ పోతుంది. రైతుబంధుకు 15 వేలు అని మోసం చేస్తున్నరు. రెండు లక్షల రుణమాఫీ సోనియా పుట్టినరోజు నుంచి ఇస్తాం అన్నారు. మరి అది ఏ పుట్టినరోజో చెప్పలేదు. సాగర్ ఆయకట్టుకు కృష్ణా నీళ్లు ఇవ్వలేక పోయారు. ఎస్ఆర్ఎస్పీలో నీళ్లు ఉన్నా ఇవ్వడం లేదు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి. వారం పది రోజుల్లోనే కేసీఆర్ బయటకు వస్తారు. తొందరలోనే నల్లగొండ వస్తానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం' అని మాజీ మంత్రి పిలుపునిచ్చారు.

# మోడీని కీర్తించడంలో ముందున్న నేతలు

## దేశంలో సమస్యల సవారీ

## పార్టీలో ప్రశ్నించే గళం లేని బిజెపి

**న్యూఢిల్లీ,జనవరి27(వెలుతురు):** దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు దిగి రావడంలేదు. ద్రవ్యోల్బణం అదుపు కావడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని కాంక్షించిన ప్రజలు రెండోమారు నరేంద్రమోడీకి అధికారం అప్పగించారు. కానీ జరుగుతున్న దేమిటి..? ప్రజల ధన, మాన, ప్రాణాలకే రక్షణ కరువైపోయింది. దేశంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా నడుస్తోంది! ఆయన వ్యూహాల ముందు మిగతా పార్టీల వ్యూహాలు చెల్లకుండా పోతున్నాయి. అందుకే నేనే సుపీరియర్ అనే భావనతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన ఇవ్వాళ ఈ స్థాయికి రావడానికి ఆ పార్టీకి చెందిన ఎంతోమంది నాయకులు.. ముఖ్యంగా ఎల్.కె.ఆద్వానీ వంటివారి ఆశిస్సులు ఉన్నాయి. ఇప్పుడు వారినందరినీ ఎక్కడ ఉంచారో అందరికీ తెలిసిందే! ప్రధానమంత్రి కాలేకపోయినా రాష్ట్రపతి అయినా కావాలనుకున్న ఆద్వానీని అడ్రస్ లేకుండా చేశారు. ఒకప్పుడు వేదికలపై ఆసీనులైన బీజేపీ అగ్ర నాయకులను వెన్నంటి తిరిగిన నరేంద్ర మోదీ, ఇప్పుడు అదే నాయకులకు తన ముందు స్వేచ్ఛగా కూర్చోలేని పరిస్థితి కల్పించారు. అంటే పదవితో పాటు గాంభీర్యాన్ని, అహాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో ప్రజల సమస్యలపై నేరుగా చర్చించే అవకాశం లేకుండా చేసుకున్నారు. పార్టీలో సమస్యలపై చర్చ జరగడం లేదు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. విదేశీ పర్యట



నలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో సమస్యలు తెలుసుకోవడానికి ఇవ్వడం లేదు. సమస్యలను పరిష్కరించ గలిగామని, వాటిని అధిగమించామని భావిస్తున్నారు. అదేరీతిలో ప్రజలను నమ్మించడానికి ప్రధాని నరేంద్రమోడీ గత పదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకే నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి చర్చించే ధైర్యం నేటికీ చేయడంలేదు. వాటివల్ల కలిగిన నష్టాలను పూడ్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎవరూ ప్రశ్నించడానికి వీలుకాని భారీ బహిరంగసభల్లో మాత్రం అనర్గళంగా మాట్లాడుతూ విపక్షాలను దుమ్మెత్తిపోస్తుంటారు. అలాగే పార్లమెంటులో కూడా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తుంటారు. బిజెపిలో పొగడ్తలకు పడిన కారణంగా ప్రజల ఇక్కట్లు వినిపించకపోవచ్చు. అందుకే సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో అసహనం రాజ్యమేలుతోంది. తాము కోరుకున్నదేమిటి? దేశంలో జరుగుతున్న దేమిటి? అనే ప్రశ్న క్రమేణా బలపడుతోంది. అభివృద్ధి పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రధాని దేశాటనలు చేస్తూ దేశ సమస్యలను మాత్రం నడిబజారులో వదిలారు.వీటికి తోడు రైతుల ఆత్మహత్యలు – ఆక్రందనలు, కార్మికుల ఆందోళనలు పట్టించుకోవడం లేదు. నల్లధనంపై పోరాటంలో తాము రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నామని అంటున్నారు. దేశంలో నల్లధనాన్ని, అవినీతిని నిర్మూలించడానికి పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ పదేపదే చెప్పుకొచ్చారు. ఈ చర్య సత్ఫలితాలు ఇచ్చిందో లేదో మాత్రం చెప్పడం లేదు. నగదు రహిత లావాదేవీల నినాదం కూడా తెరవెనుకకు వెళ్లింది. ప్రజలకు సంబంధించిన విషయాలకన్నా ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే ఆలోచనలే మోడీ ముందు ఎక్కువగా ఉంటాయి.

# సూర్యాపేట మున్సిపల్ ఛైర్మన్ పదవి పదిలం

## వీగిపోయిన అవిశ్వాస తీర్మానం - కోదాడలో నెగ్గిన అవిశ్వాసం

**సూర్యాపేట,జనవరి27(వెలుతురు):** బీఆర్ఎస్ పార్టీకి చెందిన సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్‌పై విపక్షాలు శనివారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి ఆ పదవిని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవాలని వేసిన ఎత్తులను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చిత్తు చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 48 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కలిసి అవిశ్వాసానికి కావాల్సిన 32 మంది కౌన్సిలర్లను జమ చేసి నోటీసు ఇచ్చారు. సదరు కౌన్సిలర్లను నల్లగొండ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే పర్యవేక్షణలో హైదరాబాద్, గోవాతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో 17 రోజుల పాటు క్యాంపుల్లో ఉంచారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిపి బీఆర్ఎస్‌కు 16 మంది ఉన్నారు. విపక్ష క్యాంపులో ఉన్న ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు రెండు రోజుల ముందు తాము అవిశ్వాసానికి దూరంగా ఉంటామని ప్రకటించి, ఆ తర్వాత కనిపించకుండా పోయారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. ఆ ముగ్గురికి హైదరాబాద్ సీఎం చాంబర్ కేంద్రంగా టిక్కెట్లు బుక్ చేసినట్లు సమాచారం. అందుకే తాము అవిశ్వాసానాకి దూరంగా ఉంటామని బీఆర్ఎస్ కౌన్సిలర్లను నమ్మించి మోసగించేందుకు కుట్ర చేసినట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చెబుతున్నారు.

సూర్యాపేట మున్సిపల్ పాలిటీ జనరల్ స్థానం అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించింది. ఆమెపై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించేందుకు కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు కుట్రలు చేయగా దానిని వమ్ము చేసేందుకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చక్రం తిప్పారు. శనివారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి ఓటింగ్ కోసం నిర్వహించిన




ప్రత్యేక సమావేశానికి ఒక్క కౌన్సిలర్ కూడా హాజరు కాలేదు. కాంగ్రెస్‌తోపాటు బీజేపీ, బీఎస్పీకి చెందిన 32 మంది కౌన్సిలర్లలో ఒక కౌన్సిలర్ తీర్మానానికి మద్దతు తెలిపేందుకు విముఖత వ్యక్తం చేసి బీఆర్ఎస్ శిబిరంలోకి వచ్చినట్లు తెలిసింది. దాంతో మిగిలిన 31 మంది హాజరైనప్పటికీ ఫలితం ఉండదని భావించి వారు కూడా రాలేదు. దాంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించారు. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్‌గా పుట్ట కిశోర్ కొనసాగనున్నారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించగానే బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా



కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్ చైర్‌పర్సన్ వెంపటి పద్మపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానికి రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 35 మంది కౌన్సిలర్లలో ఒకరు మృతి చెందగా, 34 మంది ఉన్నారు. ఇందులో 33 మంది హాజరు కాగా తీర్మానానికి 29 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. నలుగురు వ్యతిరేకించారు. దాంతో అవిశ్వాసం నెగ్గినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

# ఎవరికి కోపం వచ్చినా రేవంత్ దిగిపోవాల్సిందే

## బిఆర్ఎస్ నేత దాసోజ్ శ్రావణ్ హెచ్చరికలు

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):** కాంగ్రెస్ నేతలకు కోపం వస్తే ఐదేళ్ల లోపే రేవంత్ రెడ్డి సీఎంగా దిగిపోతాడని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రావణ్ హెచ్చరించారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారం ఎవరి సొత్తు కాదని.. శాశ్వతం కాదని చెప్పారు. శాశ్వతం కాని అధికార అహంకారాన్ని సీఎం రేవంత్ రెడ్డి నరనరాన ఎక్కించుకున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ గురించి రేవంత్ రెడ్డి అసభ్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గల్లీ లీడర్ కన్నా చిల్లరగా రేవంత్ తీరు ఉందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అయినా రేవంత్ తీరును మార్చాలని హితవు పలికారు. గల్లీ పహల్వాన్ భాషను రేవంత్ మార్చుకోవాలని సూచించారు. కేసీఆర్‌కు ఘోరీ కడతావా..? ఎందుకు కడతావ్..? తెలంగాణ తెచ్చినందుకా....?అని దాసోజ్ శ్రావణ్ హెచ్చరించారు.

# బిఆర్ఎస్‌కు కార్యకర్తలే కథానాయుకలు

## ఎమ్మెల్సీ దేశిపతి శ్రీనివాస్ పిలుపు

**ఆదిలాబాద్,జనవరి27(వెలుతురు):** బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే బలమని, బీఆర్ఎస్‌కు మాత్రం కథానాయకులని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బోథ్ మండలంలోని పరిచయ గాడెన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి గెలిపించాలని కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పార్లమెంట్ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి బీఅర్ఎస్ కు భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ దండే విఠల్, పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న , మాజీ శాసనసభ్యులు అత్రం సక్కు , మాజీ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కోరం లేక వీగిపోయిన ఆలేరు అవిశ్వాసం

**ఆలేరు,జనవరి27(వెలుతురు):** మున్సిపల్ చైర్మన్‌పై ఎనిమిది మంది కౌన్సిలర్లు జనవరి 8న పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం భువనగిరి ఆర్డివో అమరేందర్ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సభ్యులను సమావేశపర్చగా మొత్తం 12 మంది సభ్యులకుగాను కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. చట్ట ప్రకారం ఎనిమిది మంది సభ్యుల కోరం ఉండాలి. దాంతో ఆర్డీవో సమావేశాన్ని మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం రెండున్నర వరకు కూడా ఒక్క సభ్యుడు కూడా హాజరుకాలేదు. దాంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. మరోసారి అవిశ్వాసం పెట్టడానికి వీల్లేదని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రపాణి, లావణ్య, స్వామి, యాదగిరి, రవి, ప్రసాద్, కళ్యాణ్, జైనుధన్, తదితరులు పాల్గొన్నారు.



# ఆనందాల నిలయం కేరళ

**కేరళ రాష్ట్రం పర్యాటకతకు మారు పేరు. పచ్చటి ప్రదేశాలు, కొబ్బరి తోటలు, తాటి చెట్ల వరుసల బీచ్ లు, ఆహ్లాదకర బ్యాక్ వాటర్స్లో బోటు ప్రయాణాలు, అనేక దేవాలయాలు, ఆయుర్వేద వైద్య సుగంధాలు, నిర్మల సరస్సులు, సముద్ర ప్రాంతాలు, కాలువలు, ద్వీపాలు, మొదలైన ఆకర్షణలు ఎన్నో ఉంటాయి. ఏ ఒక్క ఆకర్షణా వదలదగ్గదికాదు. కేరళ రాష్ట్ర పర్యటన ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడిన ఒక ఆహ్లాదకర పర్యటన.**

### పర్యాటక ఛాయలు

చరిత్రను శోధించాలనుకునేవారికి, ఆనందించాలనుకునేవారికి కేరళ రాష్ట్రంలోని ప్రతి పట్టణం, నగరం, అతి చిన్న గ్రామం సైతం తమదైన ప్రత్యేకతలను చాటి ఈ రాష్ట్రానికి గాడ్స్ ఓన్ కంట్రీ అంటే, దేవుడి స్వంత దేశం అనే పేరుని సార్థకం చేస్తాయి. కేరళలోని కాసర్ గోడ్, కన్నూర్, వయనాడ్, కోజికోడ్, మలప్పురం, పలక్కాడ్, త్రిస్సూర్, ఎర్నాకుళం, ఇడుక్కి, కొట్టాయం, అలపుజ (అలెప్పీ), పాతనంతిట్ట, కొల్లం, తిరువనంతపురం అనే 14 జిల్లాలలోని పర్యాటక ప్రదేశాలు, పర్యాటకలోకంలో పయనించి ఆనందాలను అనుభవించాలనుకునే వారికి వివిధ ఆకర్షణలతో వారి వారి అభిరుచులను తృప్తి పరుస్తాయి.

కేరళ పర్యాటకత ఎన్నోఆనందకర అంశాలు కలిగి ఉంది, ఇసుక దిన్నెల బీచ్ లు, ఆనందమయ బ్యాక్ వాటర్స్, పర్వత ప్రదేశాలు, వంటివి విశ్రాంతిలో పునరుజ్జీవనం పొందాలనుకునే వారికి, సాహస క్రీడలు ఆచరించాలనుకునేవారికి లేదా ప్రశాంతతతో ఆధ్యాత్మిక జీవితం గడపాలనుకునేవారికి లేదా శృంగార కేళిలో ఓలలాడాలనుకునే జంటలకు, బిజీ నగర జీవితాలతో సతమతమై అలసి సొలసినవారికి ఒక విశ్రాంతి సెలవుల నిలయంగా ప్రతి ఒక్క ప్రదేశం విరాజిల్లుతోంది.

### కేరళలోని నీటి మార్గాలు, జల విస్తరణ

వర్కాల, బేకాల్, కోవలం, మీనకున్ను, షెరాయ్ బీచ్, పయ్యంబాలం బీచ్, శంగుముఖం, ముజుప్పిలంగాడ్ బీచ్, మొదలైనవి మిమ్మల్ని మంత్ర ముగ్ధులను చేసే బీచ్ లు. కేరళలోని అద్భుతమైన బ్యాక్ వాటర్స్ అలప్పుజా లేదా అలెప్పీ, కుమరకోం, తిరువల్లం, కొల్లం, కాసర్ గోడ్, మొదలైన చోట్ల కలవు. ఈ ప్రదేశాలు బ్యాక్ వాటర్ అనుభవాలకు ఇష్టపడేవారికి మరచిపోలేని అనుభూతులిస్తాయి. కేరళ బ్యాక్ వాటర్లలో కెట్టువలములు మరియు హౌస్ బోట్లు ఉపయోగిస్తారు. హౌస్ బోట్లు కొద్దిపాటిగా అభివృద్ధి చెందిన వినోదపు రవాణా వీటిని పర్యాటకులకు వసతిగా కూడా ఉపయోగిస్తారు. బ్యాక్ వాటర్ రిసార్టులు కూడా ఇక్కడ కలవు. సాంప్రదాయక స్నేక్ బోట్ రేసు ప్రతి ఏటా కేరళలో జరుగుతుంది. దీనిని చూసి ఆనందించేందుకు అనేకమంది పర్యాటకులు రాష్ట్రానికి వస్తారు.

వెంబనాడు సరస్సు, అష్టముడి సరస్సు, పూకోడు సరస్సు, సస్థంకొట్ట సరస్సు, వీరనపూజ వెల్లాయని సరస్సు, పరవూర్ కాయల్, మనచిరా, మొదలైన సరస్సులు కేరళ రాష్ట్రాలను మరింత అందంగా చూపి పర్యాటకులను ఆకర్షిస్తాయి. వెంబనాడు సరస్సు భారతదేశంలోని అతి పెద్ద సరస్సులలో ఒకటిగా చెపుతారు.

### సంస్కృతి, ఆహారాలు, వేష భాషలు సమగ్ర ముద్రలు

కేరళ సంస్కృతి భారతీయ సంస్కృతికి ఎంతో భిన్నంగా కనపడుతుంది. వివిధ రీతుల కళలు, ఆహారాలు, దుస్తులు మొదలైనవి పర్యాటకులకు ఆశ్చర్యం కలిగించే రీతిలో ఉంటాయి. కేరళ రాష్ట్రం అనేక నాట్యాలకు పుట్టినిల్లు. డ్రామాలు, జానపద కళలు, మొదలైనవి ప్రసిద్ధి. కథాకళి మరియు మోహినియాట్టం వంటివి ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. ప్రసిద్ధి చెందిన నాట్యాలు మత పర మూలాలు కలిగి ఉంటాయి. క్రైస్తవుల పరిసముత్తు మరియు వచిట్టు నాదకోం, ముస్లిం మతస్తుల ఒప్పన మరియు హిందూ మతస్తుల కూడియాట్టం వంటివి మత సంబంధ కళలుగా ప్రసిద్ధి కెక్కాయి. కేరళ ప్రజలకు కర్నాటక సంగీతం లో మంచి అనుభవం కలదు. కేరళ ప్రజలు వారి సాంప్రదాయ దుస్తులైన ముండు అంటే బాగా ఇష్టపడతారు.

> **నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ట్రావెల్ ప్లస్ లీషర్ సంస్థ మేగజైన్ అయిన ట్రావెలర్, కేరళ రాష్ట్రాన్ని ప్రపంచంలోని పది స్వర్గాలలో ఒకటిగాను, జీవితంలో చూడవలసిన 50 పర్యాటక ప్రదేశాలలో ఒకటిగాను, 21వ శతాబ్దంలోని 100 అతి గొప్ప పర్యటనలలో ఒకటిగాను పేర్కొంది.**

ఇక కేరళ ప్రజల ఆహారాలు పరిశీలిస్తే, పుట్టు, ఇడియప్పం, ఉన్ని అప్పం, పలడాయ్ ప్రధమన్ (ఒక రకమైన పాయసం), అరటికాయ చిప్స్, చేపల వంటకాలు, ఎర్రటి బియ్యం వంటివి కేరళ ప్రజల విభిన్న రుచులుగా రాష్ట్రంలో ప్రసిద్ధి కెక్కాయి. ఒక అరటి ఆకుపై వివిధ రకాల రుచికర వంటకాలు పెట్టి అందించే దాన్ని వారు సధ్య అంటారు. కేరళలోని ప్రధాన పండుగ అయిన ఓణం పండుగకు ఓణం సధ్య తయారు చేసి ఆనందిస్తారు.

హిందూ, క్రైస్తవ మరియు ఇస్లాం మతాలు కేరళలో ప్రధానంగా కలవు. కేరళలో పూజలకు సంబంధించి పరిశీలిస్తే, అనేక దేవాలయాలు అమ్మవార్లు లేదా వారు పిలువబడే భగవతి కి సంబంధించి ఉంటాయి. చొట్టనిక్కర భగవతి దేవాలయం, అట్టుకల్ భగవతి దేవాలయం, కొడుంగల్లూర్ భగవతి దేవాలయం, మీన కులతి భగవతి దేవాలయం, మంగోట్టు కావు భగవతి దేవాలయం మొదలైనవి భగవతి దేవాలయాలలో ప్రసిద్ధి చెందినవి. ఈ దేవాలయాలకు కేరళ రాష్ట్రంలోని వారే కాక ఇరుగు పొరుగు రాష్ట్రాలనుండి కూడా వేలాది భక్తులు వచ్చి తమ పూజలు చేసుకుంటారు.

గురువాయూర్ శ్రీ క్రిష్ణ దేవాలయం దేశ వ్యాప్తంగా భక్తులకు దైవ భక్తిని కలిగిస్తోంది. ఇక శబరిమలైలోని అయ్యప్ప దేవాలయం గురించి తెలియని వారుండరు. దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రంగా చెప్పబడుతుంది.

కేరళలోని త్రిస్సూర్ లో కల అయిరానికులం మహాదేవ దేవాలయం, తిరువనంతపురంలోని పద్మనాభ స్వామి దేవాలయం తిరువాళ్ళ శ్రీవల్లభ దేవాలయం, మొదలైనవి కూడా ప్రసిద్ధ దేవాలయాలే. కేరళ దేవాలయాల ఉత్సవాలలో భాగంగా, అక్కడి ఏనుగులు తమ వీపులపై అంబారీలు ధరించి వాటిలో దేవుడి విగ్రహాల ఊరేగింపు చేయటం అచ్చమైన భారతీయ దేవాలయాల సంప్రాదాయంగా కనపడుతుంది.

కేరళ ప్రదేశ భూమి జగద్గురువుగా కీర్తించబడే ఆది శంకరా భగవత్పాదుల జన్మతో మరింత పుణ్య భూమిగా మారింది. హిందూ మతానికి అద్వైత వేదాంతాన్ని అందించిన ఈ పరమ పూజ్యులు కేరళలోని కలాడిలో జన్మించి ఆ భూమిని ధన్యవంతం చేశారు.



మలయతూర్ చర్చి, కొచ్చి లోని సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, కొచ్చి కోటలోని శాంతా క్రజ్ బాసిలికా, కొట్టాయం వద్ద కల సెయింట్ మేరీస్ ఫోరెన్స్ చర్చి లు కేరళలో ప్రసిద్ధి గాంచినవి. పజయన్ గాడి మసీదు, మాదాయి మసీదు, చెరమాన్ జుమా మసీదు, కంజీర మాటం మసీదు, మాలిక్ దినార్ మసీదు లు ముస్లింలకు ప్రధా మసీదులు.


ఇన్ని ప్రాధాన్యతలు కల కేరళ సందర్శనకు మరెందుకు ఆలస్యం? ఎవరెవరికి ఏది కావాలో వాటిని కేరళ అందించి ఆనందింపజేస్తోంది. మరి నేడే మీ సందర్శన ప్రణాళిక చేయండి.





### కేరళ హిల్ స్టేషన్లు

కేరళలోని అందమైన మున్నార్ హిల్ స్టేషన్ నేటికి ఎంతో పవిత్రంగా కనపడుతుంది. దక్షిణ ఇండియాలోని ఇతర హిల్ స్టేషన్లతో పోలిస్తే, ఈ ప్రదేశంలో వాణిజ్య కలాపాలు చాలా తక్కువ. హనీమూన్ జంటల శృంగార కేళికి ఈ ప్రదేశం సరైనది. వయనాడ్కు సమీపంగా ఉంది. వాగమన్, పొన్ముడి, ధెక్కడి, పీర్ మేడ్, మొదలై ఇతర హిల్ స్టేషన్లు కూడా పర్యాటకులు ఆనందించవచ్చు. ధెక్కడి ప్రదేశం వన్యజీవులకు, సాహస క్రీడలకు ప్రసిద్ధి.



## భారతదేశపు పట్టు పట్టణం పోచంపల్లి

పోచంపల్లి తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో గల ఒక మండలం. ఈ మండలాన్నే భూదాన్ పోచంపల్లి అని కూడా పిలుస్తుంటారు. పోచంపల్లి పట్టు చీరాలకు ప్రసిద్ధి చెందినది. ఇక్కడ నేయబడే నాణ్యమైన పట్టు చీరాల వల్ల భారత దేశపు పట్టు పట్టణంగా పేరు పొందినది. దివంగత ఇందిరాగాంధీకి, కోడలు సోనియా గాంధీకి ఇక్కడి చీరలంటే మక్కువ. వీరే కాదు సినిమా యాక్టర్లు, రాజకీయ నేతలు సైతం ఇక్కడి చీరలంటే ఇష్టపడతారు. పోచంపల్లికి ప్రధాన ఆకర్షణ పట్టుచీరలు. కొండలు, తాటి కల్లు చెట్లు, సరస్సులు, చెరువులు, ఆహ్లాదకరమైన వాతావరణం పోచంపల్లి ఇతర ఆకర్షణ లుగా చెప్పుకోవచ్చు. ఇక్కడ చూడవలసిన ఆకర్షణలు కొన్నే ఉన్నా, ప్రకృతి ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. ఈ పట్టణానికి చాలా ఆసక్తికరమైన చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానంతర భారత దేశంలోని ఒక ముఖ్యమైన ఉద్యమానికి పోచంపల్లి లో జరిగిన సంఘటన వెన్నెముకగా నిలిచింది. 1951 వ సంవత్సరంలో ఇక్కడికి విచ్చేసిన



వినోభా భావేకి పోచంపల్లి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రజలు తమకోసం, తమ కుటుంబాల కోసం 80 ఎకరాల భూమిని కోరారు. పోచంపల్లి లో ఒక భూస్వామి అయిన వెద్రే రామచంద్ర రెడ్డి 250 ఎకరాల భూమిని ప్రజలకు స్వచ్ఛంద వితరణగా అందించారు. ఈ ఘటన భూదాన ఉద్యమ స్ఫూర్తిని బాగా రగిలించింది. అప్పటి నుంచి ఈ పట్టణం భూదాన్ పోచంపల్లిగా పిలవబడుతుంది.

పోచంపల్లిలో చూడవలసిన ఆసక్తికరమైన ప్రదేశాలలో వినోభా మందిరం, 101 ద్వారాల గృహం ముఖ్యమైనవి. విమానాశ్రయం గానీ, రైల్వే స్టేషన్ గానీ ఇక్కడ లేకపోయినా, హైదరాబాద్ నుంచి ఈ పట్టణం చేరుకోవటం తేలికే. రాష్ట్రం లోని మిగతా ప్రదేశాలలాగే పోచంపల్లి లో ఉష్ణ మండల వాతావరణం ఉంటుంది. వేసవులు మిక్కిలి వేడిగా, శీతకాలాలు చల్లగా ఉంటాయి. ఆసక్తికరమైన చరిత్రతో, విశిష్టమైన సంస్కృతితో, కొనుగోలుకి అవకాశాలతో పోచంపల్లి అనబడే ఈ చిన్న పట్టణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యాత్రికులను ఆకర్షిస్తుంది.



# సిఎం రేవంత్‌తో దగ్గుబాటు సోదరుల భేటీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దగ్గుబాటి సోదరులు సురేష్ బాబు, వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకున్న వెంకటేష్, సురేష్ బాబులు రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాసేపు ముచ్చటించారు. కాగా ప్రస్తుతం ఇందుకు ఫొటోలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సూర్యతో విడాకులు అంతా తూచ్

## పిల్లల చదువు కోసమే ముంబైకి వచ్చా

## పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన నటి జ్యోతిక



కోలీవుడ్ స్టార్ జంట సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకోనున్నట్లు గత కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా జ్యోతిక కుటుంబానికి దూరంగా ఉంటూ ముంబైలో ఉంటున్నారు. కుటుంబంలో గొడవలు ఉన్నా పిల్లల చదువుల కోసమే ముంబైకి షిఫ్ట్ అయినట్లు జ్యోతిక క్లారిటీ ఇచ్చారు. అయితే వీరిమధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయని సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకుంటున్నారని వార్తలు ఒక్కదాని వెంట మరొకటి వస్తూనే ఉన్నాయి. కుటుంబ కలహాలతోనే వీరు ముంబైలో ఉంటున్నారన్న వార్తలు మాత్రం హల్చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ వార్తలపై జ్యోతిక మొదటిసారిగా స్పందించారు. నాకు సూర్యకు మధ్య ఎలాంటి గొడవులు లేవు. పిల్లల చదువుతో
పాటు తను బాలీవుడ్ సినిమాలకు కమిట్ అవ్వడం.. నా తల్లిదండ్రుల ఆరోగ్యం బాగొలేకపోవడం వంటి కారణాలతో తాను ముంబైకు షిఫ్ట్ అయినట్లు చెప్పుకొచ్చారు జ్యోతిక. సూర్య చాలా మంచి వ్యక్తి అని.. మా ఇద్దరికీ విడాకులు తీసుకునే ఆలోచన లేదని చెప్పింది. పిల్లల చదువులు పూర్తవ్వగానే తాము చెన్నై తిరిగి వస్తామని జ్యోతిక వెల్లడించింది.

# గజిబిజి గందరగోళంగా కెప్టెన్ మిల్లర్




తమిళ సినిమా 'కెప్టెన్ మిల్లర్' అదే పేరుతో తెలుగులోకి డబ్బింగ్ చేసి విడుదల చేశారు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా తమిళంలో సంక్రాంతికి అంటే జనవరి 12న విడుదల చేశారు. అక్కడ ఈ సినిమాకి మిశ్రమ స్పందన వచ్చింది. ఇది ఒక పీరియడ్ డ్రామా, బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలిస్తున్న రోజులనాటి కథ. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, తెలుగు నటుడు సందీప్ కిషన్ ప్రత్యేక పాత్రల్లో కనపడతారు. ఈ సినిమాకి కథతో పాటు దర్శకత్వం కూడా అరుణ్ మతీశ్వరన్ చేశారు. ధనుష్ కెరీర్ లో ఈ సినిమా బ్జడెట్ ఎక్కువ పెట్టిన తీసినది. ఈ కథ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని పాలిస్తున్న రోజుల్లో, సంస్థానాలు, రాచరికాలు కూడా వున్న ప్రదేశంలో, సుమారు 1930లో జరిగే కథ. అగ్నీశ్వర (ధనుష్) ఒక గ్రామంలో తన తల్లితో ఉంటూ ఉంటాడు, కానీ అతనికి, అతని సహచరులకు ఆ గ్రామంలో కుల వివక్ష కారణంగా గుడిలోకి అడుగుపెట్టనీయరు. కనీసం గౌరవం సంపాదించాలంటే సైన్యంలో చేరితే వస్తుంది అని బ్రిటిష్ సైన్యంలో చేరతాడు. బ్రిటిష్ ప్రభుత్వం అందరికీ పేర్లు మారుస్తూ ఉంటుంది, ఇతనికి మిల్లర్ అని కొత్త పేరు ఇస్తారు. బ్రిటిష్ సైన్యంలో ఉంటూ ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయుల్ని చంపుతాడు మిల్లర్, అలా కొంతమందిని చంపాక కోపం వచ్చి తన పై వున్న బ్రిటిష్ అధికారిని చంపేస్తాడు. బ్రిటిష్ ప్రభుత్వం మిల్లర్ ని పట్టుకోబోతే తోటి సైనికుడు రఫీక్ (సందీప్ కిషన్) సాయంతో తప్పించుకుంటాడు. అక్కడి నుంచి అగ్నీశ్వర అలియాస్ మిల్లర్ దొంగగా మారతాడు. ఒకసారి అగ్నీశ్వరని సిపాయిల బారి నుంచి ఆ ఊరి మహారాజు కుటుంబానికి చెందిన అమ్మాయి భానుమతి (ప్రియాంక అరుల్ మోహన్) రక్షిస్తుంది. దొంగగా మారిన మిల్లర్ కి ఊరి గుడిలోని విగ్రహాన్ని దొంగిలించి తెమ్మని చెపుతారు, అతను సరే అంటాడు. ఇంతకూ మిల్లర్ దొంగతనం చేసిన ఆ విగ్రహం ఎవరిది? దానికి ఆ ఊరుకి సంబంధం ఏంటి? శివన్న (శివరాజ్ కుమార్) ఎవరు, అతని పాత్ర ఏంటి? శివన్నకి, మిల్లర్ కి ఎటువంటి సంబంధం వుంది, ఇవన్నీ సినిమా కథగా మలిచారు. కుల వ్యవస్థ, పోరాటాలు సినిమా ప్రారంభం అవటం బాగానే వుంది, కానీ ఆ తరువాతే గాడి తప్పుతుంది. ఫ్లాష్ బ్యాక్ లోకి కథ రావటం, మళ్ళీ ముందుకి వెనక్కి ఇలా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే సినిమాగా మలిచాడు దర్శకుడు. ఒక దశలో అయితే సినిమా ఎప్పుడు అయిపోతుందా అని ప్రేక్షకుడు అనుకునేట్టు చేసాడు దర్శకుడు. కథ నేపథ్యం ఎప్పుడో 1930 సంవత్సరం కాలం నాటిది కానీ గ్రామంలో మగ్గుతున్న ప్రజలకి ఆధునిక ఆయుధాలు రావటం, అవి ప్రయోగించే విధానం తెలియటం ఆ పోరాట సన్నివేశాలు కథ ఎక్కడ నుంచే ఇంకో దగ్గరికి వెళ్లి అసలు ఏమి జరుగుతోందో కూడా అర్థం కాదు. దర్శకుడు దృష్టి పెట్టి ఉంటే ఈ సినిమా మరింత మంచిగా సాగేది. చివరగా, 'కెప్టెన్ మిల్లర్' సినిమా ఒక మంచి కథతో ప్రారంభం అవుతుంది, బ్రిటిష్ ప్రభుత్వ అండతో అక్కడ వున్న రాచరిక కుటుంబాలు ఒక కులం వారిని ఎలా అణగదొక్కుతున్నారు, ఇంకో పక్క బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఈ నేపథ్యంలో ఉండాల్సిన కథ ఎక్కడికో వెళ్ళిపోయి ప్రేక్షకుడికి నిరాశ పరిచింది.




# ఫిబ్రవరి1 నుంచి విశ్వంభర షూటింగ్

మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాత చిత్ర పరిశ్రమ అంతా చిరంజీవిని అభినందన వెల్లువలతో ముంచెత్తారు. చిరంజీవి ఈ అవార్డుకు అన్ని విధాలా అర్హుడు అని కొనియాడారు. ఇదిలా ఉండగా చిరంజీవి తన తదుపరి సినిమా 'విశ్వంభర' ఒక ఫాంటసీ నేపథ్యంలో చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి మల్లిడి వశిష్ట దర్శకుడు, ఈ సినిమా షూటింగ్ కూడా ఎప్పుడో మొదలైంది. ఈ సినిమాకి ముందుగానే చాలా ప్రీ ప్రొడక్షన్ పనులు జరిగాయి. ఎందుకంటే ఈ సినిమాకి కంప్యూటర్ గ్రాఫిక్స్ చాలా అవసరం అవుతాయి. కొన్ని రోజుల క్రితం ఈ సినిమా రివీల్ చేస్తూ టీజర్ ఒకటి విడుదల చేశారు, అది వైరల్ అయింది కూడా. అయితే ఇప్పుడు చిరంజీవి షూటింగ్ ఎప్పుడు మొదలు పెడుతున్నారు అనే విషయం మీద ఒక అప్డేట్ వచ్చింది.

ఫిబ్రవరి 1 నుండి చిరంజీవి ఈ సినిమా షూటింగ్ మొదలెడుతున్నట్టుగా తెలిసింది. నిన్న చిరంజీవిని అభినందించడానికి వచ్చిన వాళ్ళతో పిచ్చా పాటీ మాట్లాడుతూ తాను ఫిబ్రవరి 1 నుండి 'విశ్వంభర' సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నట్టుగా చెప్పారు. సుమారు రెండు వారాలు ఈ సినిమా షూటింగ్ లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఆ తరువాత చిరంజీవి ఒక చిన్న బ్రేక్ తీసుకోవడానికి అమెరికా పయనం అవుతున్నట్టుగా కూడా తెలిసింది. తరువాత మళ్ళీ ఈ సినిమా షూటింగ్ లో నిరవధికంగా పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుండగా, ఎంఎం కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.




# 250 కోట్ల క్లబ్‌లో హనుమాన్

టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'హనుమాన్' భారతీయ ఇతిహాసాల్లోని హనుమంతుని కథ స్ఫూర్తితో ఇండియన్ తొలి ఒరిజినల్ సూపర్‌హీరో మూవీగా ఈ చిత్రం రాగా తేజ సజ్జా, అమృత అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది. తాజాగా ఈ చిత్రం 17 రోజుల్లో వరల్డ్ వైడ్‌గా రూ.250 కోట్ల మార్కును అందుకుంది. ఇక రానున్న రెండు రోజులు వీకెండ్ రావడంతో ఈ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉంది.
హనుమాన్ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కే నిరంజన్ రెడ్డి తెరకెక్కించగా.. కోలీవుడ్ భామ అమృతా అయ్యర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. వరలక్ష్మి శరత్ కుమార్, వినయ్ రాయ్, రాజ్ దీపక్ శెట్టి, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి గౌరా హరి-అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ సంయుక్తంగా మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. జాంబిరెడ్డి తర్వాత తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో ఈ సినిమాను జనాలు క్యూ కడుతున్నారు.

# సంఘీ అంటూ రజనీకాంత్‌పై విమర్శలు

## ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్న కూతురు ఐశ్వర్య



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి ఐశ్వర్య రజినీకాంత్ డైరెక్ట్ చేస్తున్న లాల్‌సలామ్ . విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఐశ్వర్య రజినీకాంత్ ప్రమోషన్స్ వేగం పెంచింది. రిపబ్లిక్ డే కానుకగా ఈ సినిమా ఆడియో లాంఛ్ ఈవెంట్ చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ.. రజినీకాంత్ పై వస్తున్న ట్రోల్స్‌పై తాజాగా స్పందించింది. సోషల్‌మీడియాలో మా నాన్న 'సంఘీ' అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నిజానికి సోషల్‌మీడియాకు నేను చాలా దూరంగా ఉంటా.. ఆన్‌లైన్ నెగెటివిటీ గురించి నా టీమ్ తరచూ చెబుతుంటుంది. అలాగే నాన్నగారి పై వస్తున్న నెగటివిటీ గురించి కూడా నా టీమ్ ద్వారా తెలుసుకున్నాను. మేమూ మనుషులమే. మాకూ భావోద్వేగాలు ఉంటాయి. ఈ మధ్యకాలంలో నా తండ్రిని 'సంఘీ' (హిందుత్వ ఐడియాలజీని ఫాలో అయ్యేవారు) అంటూ విమర్శలు చేస్తున్నారు. అయితే 'సంఘీ' అంటే మొదట్లో నాకు కూడా తెలిదు. కానీ తర్వాత దానికి అర్థం తెలుసుకున్నా. ఒక రాజకీయ పార్టీ(బీజేపీ)కి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అని పిలుస్తారని తర్వాత తెలుసుకున్నాను. రజినీకాంత్ సంఘీ కాదు. నాన్న అలాంటి వారే అయితే లాల్ సలామ్ చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో నటించే వారే కాదు. దయచేసి ఇలాంటివి ఆపండి అంటూ ఐశ్వర్య చెప్పింది.

## కొత్త పథకాలతో దోపిడీకి సిద్ధం

### ఎమ్మెల్యే ఆనం ఘాటు విమర్శలు

**నెల్లూరు,జనవరి27(వెలుతురు):** రాష్ట్రంలో కొత్త కొత్త దోపిడీ పథకాలకు తెర తీస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఫిబ్రవరి చివరిలో ఎన్నికల షెడ్యూల్ వస్తుంటే మొదటి వారంలోనే లక్షాముప్పైవేల ఎకరాల దోపిడీకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అనం రామనారాయణరెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రా–కదలిరా కార్యక్రమం ద్వారా నెల్లూరు వేదికగా రాష్ట్రంలో సాగుతున్న అప్రజాస్వామిక పాలనని ఎండగడతామని హెచ్చరించారు. ఆనాడు నందమూరి తారక రామారావు ఇచ్చిన రా–కదలి రా అంటూ ఇచ్చిన పిలుపు ఇప్పుడు గుర్తొస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు తమకు జరిగిన అన్యాయాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల సర్వే పేరుతో పేద ప్రజల భూములు దోచేస్తున్నారన్న ఆనం.. రైతుల్లో ఆవేదన, ఆందోళన, అక్రందన ఉందని స్పష్టం చేశారు. ఆనం.. స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారులు, మేము చేయలేమని చెబితే వారిని సస్పెండ్ చేసిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్ని ÷ర్ అయ్యారు. తమకూ చీఫ్ విప్, స్పీకర్ ఆఫీస్ నుంచి నోటీసు వచ్చిందని, వెంటనే స్పందించమని తిరిగి నోటీసు ఇచ్చారని చెప్పారు. అంతే కాకుండా ఒరిజినల్ డాక్యుమెంట్స్ పంపమని అడిగామన్నారు. పార్టీ పరంగా చంద్రబాబు ఆదేశాలు, లీగల్ సూచనలు మేరకు నిర్ణయం తీకుంటామని వివరించారు. మూడు సంవత్సరాల క్రితం గంటా శ్రీనివాస్ రాజీనామా ఇస్తే, ఇప్పుడు ఆమోదించారని పేర్కొన్నారు.

## అమెరికాలో అరెస్ట్ అంటూ పోస్టులు

### ఘాటుగా స్పందించిన నారా లోకేశ్

**అమరావతి,జనవరి27(వెలుతురు):** వైసీపీ ఆకతాయిలు కొంతమంది ఆ పార్టీకి అనుకూలంగా పోస్టులు పెడుతూ టీడీపీ నేతలపై సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రచారం చేస్తున్నారు. నారా లోకేష్, టీడీపీ నేతలు వీరిని పలుమార్లు హెచ్చరించినా వైసీపీ పద్ధతి మాత్రం మారడం లేదు. ఈ నేతలపై నారాలోకేష్, టీడీపీ నేతలు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన రీతిలో చర్యలు తీసుకోవడం లేదు. ఇదే అదునుగా వారు రెచ్చిపోతున్నారు. ఆకతాయులు మరోసారి రెచ్చిపోయి లోకేష్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారు. అమెరికాలో లోకేష్‌ను అరెస్ట్ చేశారని కొంతమంది వైసీపీ కి చెందిన వారు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంపై లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమెరికాలో మనీ లాండరింగ్ అరెస్ట్ అయినట్లు జరుగుతున్న ప్రచారంపై తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ స్పందించారు. హైదరాబాద్ నుంచి గన్నవరానికి లోకేష్ చేరుకున్నారు. అమెరికాలో మనీ లాండరింగ్ కేస్‌లో అరెస్ట్ చేసింది నన్నా... జగన్ రెడ్డినా.. జగన్ కూతురునా... భారతి రెడ్డినా.. నా మీద సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన గాడిదలను అడగండి.. అందరూ జగన్ లాగా దొంగలు ఉండరని నారా లోకేష్ హెచ్చరించారు.

## ప్రజా వెల్లువలో జగన్ కొట్టుకుపోవడం ఖాయం

### ఉరవకొండ సభలో కేశవ్ వెల్లడి

**అనతంపురం,జనవరి27(వెలుతురు):** వైసీపీ ప్రభుత్వం బిందుసేద్యాన్ని పక్కన పెట్టిందని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం నాడు ఉరవకొండలో 'రా.. కదలి రా' సభ నిర్వహించారు. ఈ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... ఈ సభలో ప్రజా వెల్లువ చూస్తేనే రాబోయే ఎన్నికల్లో ఏం జరుగుతోందో



తెలుస్తోందన్నారు. అనతంపురం జిల్లాలో ఎగిరేది టీడీపీ, జనసేన జెండాలేనని స్పష్టం చేశారు. ఉరవకొండలో అందించిన సేవలకు సంతృప్తిగా ఉందన్నారు. నీళ్లు ఇస్తే రతనాలు పండించగలమని గతంలో రుజువు చేశామన్నారు. రాయలసీమకు నీళ్లు ఇస్తే మా తలరాతలు మారతాయని చెప్పారు. కరువుతో పోరాడిన ధైర్యం సీమ రైతులకు ఉందని.. టీడీపీ హయాంలో అనేక ప్రాజెక్టులు పూర్తి చేశామని పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.

## ఉపాధి అవకాశాలు పెంచేందుకే స్కిల్ సెంటర్లు

### నల్లగొండ సెంటర్‌కు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన

**నల్గొండ,జనవరి27(వెలుతురు):** యువతలో నైపుణ్యతను పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పుతున్నామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్గొండ పట్టణంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు



శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ, యువకుల జీవితాలు, వారి కుటుంబాల్లో స్కిల్ సెంటర్లు ఎంతగానో పనిచేస్తాయని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, దురాలవాట్లకు లోనుకాకుండా స్కిల్ సెంటర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతకు, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదువుకున్న యువతీ, యువకులకు మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ బేసిక్స్, వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి స్వయం ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు.

నాయకులకు రాజకీయాలు శాశ్వతం కాదని, చేసిన మంచి పనులే పదికాలాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబెడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ పాస్‌పోర్టు కేసులో పురోగతి

### పలు నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం : నిందితుల కోసం లుకౌట్ నోటీస్ జారీ

**హైదరాబాద్,జనవరి27(వెలుతురు):** ఫేక్ పాస్‌పోర్టుల కుంభకోణం కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను సీఐడీ అరెస్ట్ చేసింది. ఏపీలోని అనంతపురానికి చెందిన ఏజెంట్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఫేక్?పాస్‌పోర్టులు సహా పలు నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 12 మందిని అరెస్టు అయిన సంగతి తెలిసిందే. నిందితులందరిని కస్టడీకి తీసుకొని విచారించనున్నారు. మొత్తం 92 నకిలీ పాస్‌పోర్టులను జారీ అయినట్లు గుర్తించారు. నిందితుల సమాచారంతో 35కి పైగా పాస్‌పోర్టులను రద్దు చేశారు. నకిలీ పాస్‌పోర్టు కేసులో సీఐడీ అధికారులు లుకౌట్ నోటీస్ జారీ చేశారు. ఫేక్ పాస్‌పోర్టుతో 92 మంది దేశం విడిచి వెళ్లినట్టు గుర్తించి వారి వివరాలను విదేశాంగ శాఖకు పంపించారు. వారిని వెనక్కి రప్పించి విచారించాలని సీఐడీ భావిస్తోంది. ఈ క్రమంలోనే 92 మంది పాస్‌పోర్టులను రద్దు చేయాలని రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్‌కు సీఐడీ లేఖ రాసింది. ఈ స్కాంలో ఏజెంట్లు, పాస్‌పోర్టు సిబ్బంది, ఎస్‌బీ సిబ్బంది కుమ్మక్కైనట్టు సీఐడీ అధికారులు భావిస్తున్నారు. జగిత్యాలతో పాటు ఫలక్‌నుమా చిరునామాలతో ఫేక్ పాస్‌పోర్టులు ఎక్కువగా పొందినట్లు గుర్తించారు.






## ఇక్కడున్నది అభిమన్యుడు కాదు..అర్జునుడు

### తనవైపు ఉన్నదంతా పాండవ సైన్యం
### అటువైపు ఉన్నదంతా కౌరవ సైన్యం
### మీరే నాబలం..మీరే నాగళం
### మీరే నా స్టార్ కాంపెయినర్లు
### భీమిలి వేదికగా ఎన్నికల శంఖారావం పూరించిన జగన్

**విశాఖపట్టణం,జనవరి27(వెలుతురు):** విశాఖపట్నంలోని భీమిలి వేదికగా సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2024 ఎన్నికల శంఖారావం పూరించారు. వైనాట్ 175 నినాదంతో గత ఏడాది నుంచి పలు కార్యక్రమాలు చేపట్టిన వైసీపీ ఈ సభతో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టింది. సిద్ధం పేరుతో భీమిలి నియోజకవర్గంలోని సంగివలస వద్ద నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. తన వెంట ఉన్నది పాండవ సైన్యం కాగా, అటువైపు కౌరవ సైన్యం ఉందని.. వచ్చే ఎన్నికల యుద్ధంలో పద్మ వ్యూహం పొంచి ఉందన్నారు. ఆ పద్మ వ్యూహంలో చిక్కుకుపోవడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడు అన్నారు. ఈ అర్జునుడికి కృష్ణుడి లాంటి ప్రజలు తోడున్నందుకు ఎన్నికల యుద్ధంలో దుష్టచతుష్టయం చంద్రబాబు సహా అందరి ఓటమి తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే ఎందుకు సిఎం కావాలో వివరిస్తూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరాయన్నారు. ఇవన్నీ ముందుకు సాగాలంటే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ గుర్తించి ముందుకు రావాలన్నారు. పథకాలు పొందిన మీరంతా నాకు స్టార్ కాంపెయినర్లని అన్నారు. పైన దేవుడిని, ఇక్కడ మిమ్ములను నమ్ముకున్నానని, మీరే నా కాంపెయినర్లని అన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేర్చాం.. ఇప్పటివరకు 99 శాతం హామీలు నెరవేర్చామని అన్ని స్థానాల్లో తమదే విజయమన్నారు. మనం చేసే మంచి పనులే వైసీపీని గెలిపిస్తాయని చెప్పారు. ఎంతో రాజకీయ అనుభం ఉన్న చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు.. అందుకే వేరే పార్టీల వెంట పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని సీఎం వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. ఎంతో రాజకీయ అనుభం ఉన్న చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు.. అందుకే వేరే పార్టీల వెంట పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని సీఎం వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడి వెంట తిరుగుతున్నా.. గత ఎన్నికల్లో వచ్చిన 23 స్థానాలు కూడా టీడీపీకి రావన్నారు. మరో 25 ఏళ్లపాటు జైత్రయాత్రకు శ్రీకారం చుడుతున్నాం. పేదరికాన్ని, అసమానతలను పోగొట్టిన బాధ్యతల ప్రభుత్వం వైసీపీదేనన్నారు. మరో 75 రోజుల్లో ఎన్నికల యుద్ధం జరగబోతోంది కనుక ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ యుద్ధం అబద్దానికి, నిజానికి మధ్య.. మోసానికి, నిజాయితీకి మధ్య జరుగుతుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన 650 హామీల్లో కనీసం 10 శాతం కూడా నెరవేర్చలేదని సీఎం జగన్ ఆరోపించారు. వైసీపీ సర్కార్ దాదాపు అన్ని హామీలను నెరవేర్చిందన్నారు. ఇచ్చాపురం నుంచి కుప్పం వరకూ చంద్రబాబు చేసేందేమీ లేదని.. టీడీపీ ఏం చేసిందో చెప్పడానికి ఏమీ కనిపించదన్నారు. 56 నెలల కాలంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించాం.. అందరూ ఇది గమనించాలన్నారు. 'ఎక్కడా వివక్ష లేకుండా ఒకటో తేదీన ఉదయాన్నే పెన్షన్ అయినా, పౌర సేవలైనా, ఏ పథకమైనా గడపకు అందించిన ప్రభుత్వం మాది. అందుకోసం గ్రామ వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సక్సెస్ అయ్యామని చెప్పండి. రైతలన్నల కోసం ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు చేశాం. విలేజ్ క్లినిక్ ఫ్యామిలీ డాక్టర్ ఇంటింటినీ జల్లెడపట్టి ఆరోగ్య సురక్ష అందించాం. ప్రభుత్వ బడిని నాడు నేడుతో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంతో పాటు ట్యాబ్స్ ఇచ్చాం. మహిళా పోలీస్‌ను, దిశా యాప్ ను ఒక్క బటన్ నొక్కితే అక్కాచెలెమ్మల రక్షణ కోసం పోలీసులు చేరుకుని, ఏం జరిగిందని వాకబు చేసే వ్యవస్థను తీసుకొచ్చాం. డిజిటల్ లైబ్రరీలు, ఇంటర్నెట్ బ్రాడ్ బ్యాండ్ లు ఏర్పాటు చేసి మార్పులు తీసుకొచ్చాం.

ఈ మార్పులు ఇచ్చాపురం నుంచి కుప్పం వరకు కనిపిస్తాయని' ఏపీ సీఎం జగన్ అన్నారు. అవినీతి లేకుండా, వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలను అమలు చేసిన ఘనత తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో వైవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పట్టని పాలకమండలి

### సౌకర్యాల నిలయంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్
### మార్కెట్ హమాలి సంఘాలు సిఐటీయు ఆధ్వర్యంలో ధర్నా

**కర్నూలు,జనవరి27(వెలుతురు):** కర్నూలు వ్యవసాయ మార్కెట్ లో ఏళ్లు గడుస్తున్నా హమాలి కార్మికుల సమస్యలు తీర్చడం లేదని కమిషన్ల కక్కుర్తి లో దోచుకోవడం దాచుకోవడంలో ఉన్నంత శ్రద్ధ కార్మికుల సమస్యలు తీర్చడంలో ఉండాలని మార్కెట్ యార్డ్ హమాలి సంఘాల గౌరవాధ్యక్షులు టి.రాముడు అన్నారు.శనివారం మార్కెట్ హమాలి యూనియన్ నాయకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన కోత కూలి, చాట కూలి, పట్టుబడి, లోడ్ ఆన్ లోడ్, తదితర కార్మికులతో దాదాపు 500 మందితో మార్కెట్ లో ర్యాలీ నిర్వహించి మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతుగా సిఐటీయు జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ, శ్రామిక మహిళ సంఘం జిల్లా కార్యదర్శి నిర్మల, గౌరవాధ్యక్షులు టి.రాముడు హాజరయి మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లో ఏళ్ళు గడుస్తున్నా కార్మికులకు యూనిఫామ్, గుర్తింపు గా ఐడి కార్డులు, మహిళలకు, పురుషులకు మరుగుదొడ్లు, త్రాగడానికి మంచి నీళ్ళు టాంక్స్ ఏర్పాటు, చనిపోయిన కార్మికులకు ఇన్సూరెన్స్ మంజూరు, జంబో షెడ్డు నిర్మాణం, రోడ్లు వేయడం వల్ల విద్యుత్ స్తంభాల తీగలు కిందకు ఉండటం వల్ల లోడింగ్ హమాలీలు ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఈ డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా పలుసార్లు ధర్నాలు ర్యాలీలు నిర్వహించిన మార్కెట్ కమిటీకి, పాలకమండలికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. దాదాపు 2 వేల మంది కార్మికులు ఉండే చోట మార్కెట్ కు లక్షల ఆదాయాన్ని ఇస్తున్న కార్మికుల కనీస అవసరాలు తీర్చలేని కమిటీ ఉండటం దురదృష్టకరామన్నారు. పాలక మండలి నిర్లక్ష్యం విడి కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. గతేదాది ఎండ తీవ్రతకు, గుండెపోటుతో హమాలి కార్మికులు మరణిస్తే నేటికి కూడా ఇన్సూరెన్స్ అందకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకమండలి,మార్కెట్ అధికారులు తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిస్కారం చేయాలని లేని చేపడతామని, యూనిఫామ్, గుర్తింపు కార్డులు త్వరలో ఇస్తామని ,షెడ్డు నిర్మాణం వీలైనంత త్వరగా నిర్మాణం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ డిమాండ్లను 2 నెలలోపు అమలు చేయకుంటే ఈ పోరాటం




పక్షంలో ధర్నాలతో కాకుండా మార్కెట్ బంద్, ఆమరణ దీక్షలు కూడా చేస్తామని హెచ్చరించారు.

మార్కెట్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి గోవిందులకు యూనియన్ నాయకులు వినతిని అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాగు నీటి ట్యాంకులు నాలుగు చోట్ల పెట్టిస్తామని, మరుగుదొడ్లను నిధులు మంజూరు అయ్యాయని త్వరలో నిర్మాణం మరింత ఉధృతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగరకార్యదర్శి సియచ్.సాయిబాబా, నాయకులు కె.సుదాకరప్ప, కె.ప్రభాకర్, ఉశేన్ వలి, హమాలి సంఘాల నాయకులు నాగరాజు, వెంకటస్వామి, దస్తగిరి, చిన్నబడేసా, రామక్రిష్ణ, మనోహర్, వెంకటేశ్వర్లు, మిన్నల్లా, నాగన్న, క్రిష్ణ, పరమేష్, మహిళ హమాలీలు నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలవేళ కులగణన అవసరమా?

### ప్రభుత్వ తీరును ప్రశ్నించిన పవన్ కళ్యాణ్

**అమరావతి,జనవరి27(వెలుతురు):** సార్వత్రిక ఎన్నికల వేళ పలు రాష్ట్రాల కులగణనకు శ్రీకారం చుట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం కులగణనను చేపట్టింది. దీనిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శలు చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కులగణన చేపట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు...ఎక్స్ వేదిక ద్వారా లేఖ రాశారు. కులగణనపై సీఎం జగన్ కు పలు ప్రశ్నలు సంధించారు. ఈ కులగణన ఉద్దేశం మీకు ఎన్నికల ముందే ఎందుకు వచ్చిందని అన్నారు. ప్రభుత్వ వనరులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని స్వీయ ప్రయోజనాలకు వాడుకోవడం, దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వా మ్యానికి తూట్లు పొడవటం కాదా అని అన్నారు. వాలంటీర్లు ద్వారా వైసీపీ ప్రభుత్వం సేకరిస్తున్న కులగణన, ఇతర వివరాలను ఏ కంపెనీలో భద్రపరుస్తారు అనే అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. జగన్ రెడ్డి, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలపై రాజకీయంగానే న్యాయపరమైన మార్గాలను కూడా విశ్లేషించే దిశగా ఆలోచిస్తాం అన్నారు. కులగణనకి సంబంధించి పవన్ కళ్యాణ్ అడిగిన ప్రశ్నల మేరకు సీఎం జగన్ కు లేఖ రాశారు. కులగణన చేపట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్నారు. పక్రియకు కారణాలు వివరిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదు. ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తిగత గోప్యత, భద్రత, స్వేచ్ఛను హరించడం కాదా అని ప్రశ్నించారు. ఈమేరకు ఎక్స్ లో ఏపీ సీఎం జగన్‌కి.. పీఏంవోకు ట్యాగ్ చేశారు పవన్. బిహార్ ప్రభుత్వం చేసిన కులగణనపై సుప్రీంకోర్టు తీర్పు రాకముందే మీ స్వీయ ప్రయోజనాలకు ఎందుకు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని



క్వశ్చన్ చేశారు పవన్. ఏపీలో జరుగుతున్న కుల గణనను తప్పుబట్టారు జనసేనపార్టీ అధినేత. కులగణన పక్రియపై పవన్ కల్యాణ్ పలు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల వేళ కుల గణన ఎందుకు అని ప్రశ్నించారు. మొత్తం 12 ప్రశ్నలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## కులగణనతో బాబు, పవన్‌లకు భయం

### ఇంతకు వారు అనుకలమా ..వ్యతిరేకమా ?
### మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

**అమరావతి,జనవరి27(వెలుతురు):** చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కులగణనతో భయపడుతున్నారని మంత్రి వేణుగోపాల్ కృష్ణ ఎద్దేవా చేశారు. కులగణనపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మంత్రి వేణుగోపాల్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. ఇంతకీ పవన్ కళ్యాణ్ కులగణనకు అనుకులమా? వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. అవగాహన రాహిత్యంతో పవన్ కళ్యాణ్ కులగణనపై వ్యాఖ్యలు చేసారు.. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీహార్ లో కులగణనపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు అనుగుణంగానే కులగణన జరుగుతుంది.. రాష్ట్రంలో పౌరులు ఏవిధంగా జీవిస్తున్నారు.. వారి అవసరాలపై కులగణన జరుగుతుంది.. సామాజిక, విద్యా, నివాస స్థితి తెలుసుకోవడంలో తప్పేముంది అని మంత్రి వేణుగోపాల్ కృష్ణ ప్రశ్నించారు.రాష్ట్రంలో 67 శాతం కులగణన పూర్తైంది.. 1,26,000 కుటుంబాలను నేరుగా చూశాం.. 2 కోట్ల జనాభాతో మాట్లాడాం.. కులగణన జరిగితే బీసీలు టీడీపీకి దూరమవుతారని చంద్రబాబు భయపడుతున్నారు అని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు.చంద్రబాబు జనసైనికులను మోసం చేయడానికే టికెట్లు ముందు ప్రకటించారని పేర్కొన్నారు. చంద్రబాబు ఎనౌన్స్ చేసే సీట్ల సంఖ్యకు తగ్గట్టు పవన్ కళ్యాణ్ అదే సంఖ్య ప్రకటించే ధైర్యం ఉందా?.. రేపొద్దున చంద్రబాబు 150 అంటే పవన్ కళ్యాణ్ 150 అనగలడా? అని ఆయన ప్రశ్నించారు. 15 లేదా 20 సీట్లలో పవన్ కళ్యాణ్ దిగజారి పోటీ చేస్తారు, తప్పా అంతకు మించి ఏమీ లేదు.. జగన్ మోహన్ రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పని చేస్తున్నాడు.. తప్పితే ప్రజలపై చిత్తశుద్ధి లేదు అని మంత్రి వేణుగోపాల్ కృష్ణ తెలిపారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com